# నల్ల తంబి



### ఇచ్ఛాపురపు రామచంద్రం

**ఆ**ఫీసులో అడుగుపెట్టి వెంటనే నేను చేసిన మొదటిపని రోజ్ గదిలోకి నడవడం రోజ్ రిసెప్షనిస్టూ, పి బి యక్స్ ఆపరేటరూను అతిథులను ఆహ్వానించడమూ, ఫోన్‌కాల్స్ ఎవరివి వారికి అందించడమూ - యిలాగ జోడు గుర్రాల స్వారీ చేసే అమ్మాయి

రోజ్ - పేరుకి తగిన అమ్మాయి అచ్చంగా గులాబిరేకులా సున్నితంగానూ సుందరంగానూ ఉంటుంది ఎప్పుడూ తాజాగా ఉన్నట్లే కనిపించగలిగే నైపుణ్యం ఉందామెకి ఆఫీసు మీద కంప్లయింట్ చేయడానికి వచ్చిన ఉగ్ర నరసింహమూర్తి కూడా రోజ్ చిరునవ్వు పలకరింపులతో శాంతించి తీరుతాడు రిసెప్షనిస్టుకి అన్నివిధాల అను

వయిన అమ్మాయి రోజ్. ప్రెట్టి రోజ్

"ప్లీజ్ బి సీటెడ్..." నన్ను చూసి ఆహ్వానించింది

"మిస్ రోజ్ ! నీతో కొంచెం పని ఉండి వచ్చాను "

"చెప్పండి రావ్ జీ " చనువుగా అందామె

"ఇవాళ నాకొక కాల్ రావచ్చు పర్సనల్... చాలా ముఖ్యమైనది..."

ఆమె దెబ్బతిన్నట్లు తలవంచుకుని- "నేను సిన్సియర్‌గానే పనిచేస్తాను సార్," అంది బాధపడినట్లు సూచిస్తున్న కంఠంతో

"సారి రోజ్. నా ఉద్దేశం నిన్ను బాధించాలని కాదు. నువ్వు చాలా సిన్సియర్ అని నాకు తెలుసు కాని...ఇవాళ నేనెదురుచూస్తున్నది చాలా ముఖ్యమయిన వర్తమానం గురించి అందుచేత- ఆత్రతకొద్దీ... అంతే సమయాని కిక్కడ మెసంజర్ లేకపోతే..."

"నేనే వచ్చి మీకు చెబుతాను ఏం?"

"థాక్యూ నీకు శ్రమా బాధా కలిగిస్తే..."

"లేదు రావ్‌జీ " ఎప్పటిలా చక్కగా చిరునవ్వు నవ్వింది

నిజంగా తాను ఏమాత్రమూ నొచ్చుకోనట్లే ధన్యవాదాలు చెప్పింది

బయటకు వచ్చాను రోజ్ చిందించిన అందమయిన మందహాసం నాలో రేకెత్తించిన మైకంనుంచి పూర్తిగా తేరుకోకుండానే

మేడ మెట్లెక్కి - రూము చేరుకున్నాను

అప్పటికే టేబులుమీద కొన్ని కాగితాలు నా ఆమోదముద్రల కెదురు చూస్తున్నాయి వాటిని ఎర్ర నాలుక (అర్జంట్ ఫ్లాప్) చుట్టుకుని ఉండలేదు కనుక వాటి సంగతి వాయిదా వేశాను పని చెయ్యాలనిపించడంలేదు మనస్సు మరోచోట లగ్నమై ఉంది పోస్టుపోన్‌మెంట్ కూడా ఒకవిధమయిన స్ట్రాటజీయే, అరుదుగా అదీ పనిచేస్తుందన్న మానేజ్‌మెంట్ ఉవాచను గుర్తుతెచ్చుకుని సరిపెట్టుకున్నాను పోనూ, ఎక్కువమంది సబార్డినేట్స్ లేకపోయినా నా పదవికున్న బాధ్యత తక్కువ కాదు అందుచేత-ఆర్డర్స్ వేసేముందు వొళ్ళు దగ్గర పెట్టుకుని మరీ చూడాలి. లేకపోతే పరిణామాలు భయంకరంగా తయారౌతాయి

సిగరెట్ అంటించాను

ఆ పొగలు చూస్తూ కొంతవరకూ కాలాన్ని జయించాను

తరువాత - ఆ కాగితాలు చూడడం కంటె గత్యంతరం లేకపోయింది కొంచెంకదిపేసరికి కొండచిలవల్లా చుట్టుకుని నన్నాక్రమించుకోసాగాయవి నన్ను నేను మరచిపోయాను. ఆ కాగి

తాల బిగికౌగిలిలో ఎంత సేపుండి పోయానో తెలియదు

"సార్ !" స్వింగ్ డోర్స్ తెరచుకుని వచ్చాడు మెంసజర్ "రోజమ్మగారు మీకు ఫోన్‌కాల్ వచ్చిందని చెప్ప మన్నారు"

కుర్చీలోంచి స్ప్రింగ్‌లా గెంతి - పరుగులాటి నడకతో ఆ గది చేరుకున్నాను

రోజ్ రిసీవరందించింది

"థాంక్యూ ఎ లాట్"

రిసీవరందుకున్నాను

"యస్... రావ్‌నే... మాధవీ."

"ఊఁ, మీరు అర్జంట్‌గా రావాలి"

"అబ్బాయా అమ్మాయా ? నలుపా, తెలుపా ?" ఆత్రంగా అడిగాను

'దయచేసి మీరు వెంటనే రండి"

ఫోను పెట్టేసిన శబ్దం

ఆ కంఠంనిస్సందేహంగా మాధవిదే.

ఆమె గొంతు గద్గదికంగా ఉంది. ఏం జరిగిందని ?

తంబి కాకుండా ఆమె ఎందుకు శ్రమపడి ఫోను చెయ్యవలసి వచ్చింది.

మాధవి ప్రసవించిందా? అబ్బాయా, అమ్మాయా ?

అంతకంటె ముఖ్యం- బేబీ నలుపా, తెలుపా?

ఎవరి పోలికలు ? మాధవివా, తంబివా ?

ప్రశ్నల పరంపర

ఒక్కదానికీ సమాధానం తెలియదిప్పుడు

హాస్పిటల్‌కి వెళ్లాలి స్వయంగా తెలుసుకోవాలి. అంతకంటే మరోమార్గం లేదు

అన్నిటికంటె ముఖ్యమైన ప్రశ్న- బేబీ నలుపా, తెలుపా ?

మనసు ఆత్రంగా కొట్టుకుపోతూంది.

ఆ ప్రశ్నకు సమాధానంమీద ఒక జీవితపు విజయమూ ఓటమీ ఆధారపడి ఉంటాయి

ఇంతకీ తంబి ఏమైపోయాడు ?


ఇటువంటి సమయంలో మాధవిని ఒంటరిగా వదిలి అతనేం చేస్తున్నట్లు?

గుండె స్పీడు పెంచేసుకుంటూంది క్షణ క్షణానికి

పర్మిషన్ కన్వే చెయ్యమని రోజ్‌కి చెప్పి- కొలీగ్ కారు తీసుకుని హాస్పిటల్‌కి బయలుదేరాను స్వీట్స్ కొని తీసుకువెళ్దామా అన్న ఆలోచన వచ్చింది కానీ కారాపడం యిష్టంలేదు వీలయినంత తొందరగా హాస్పిటల్‌కి చేరుకోడమే నా ధ్యేయం

రెండు ఫర్లాంగులు వెళ్ళానో లేదో ట్రాఫిక్ జామ్ !

అసలే ఆత్రతగా ఉన్న నన్ను జామ్ మరీ చికాకు పెట్టింది, కారులు తీర్చి నిలచి ఉన్నాయి కార్లూ తదితర ప్రయాణ సాధనాలూ వెనక్కిపోయే అవకాశం లేదు కనీసం పావుగంటో




అరగంటో గడిస్తే తప్ప ట్రాఫిక్ క్లియర్ అయ్యే సూచనలు లేవు

గ్రీన్ సిగ్నల్ కోసం చూస్తూ ఇంజ నాపాను.

ఆలోచనలు– తంబి గురించి

తంబి త్రండి కావడం అనేది చాలా తమాషాగా ఆశ్చర్యంగా అనిపిస్తూం దెందుకనో

నిజమే

తంబి జీవితమే ఓ తమాషా

విషాద భరితమయిన విచిత్రం

* * *

**1**

హైస్కూల్లో చదువుకుంటున్న రోజు లవి ఓ సాయంత్రం... చీకటిపడే వరకూ ప్లేగ్రౌండ్‌లోనే ఉండిపోయాను

"తారు డబ్బా!"

"సిరా బుడ్డి!"

"మాలకాకి.." "మసిబొగ్గు .."

పదిమంది పిల్లలు గొంతెత్తి అరుస్తున్నారు గుండ్రంగా గుడికట్టి వాళ్ళ అరుపుల మధ్యగా ఎవరిదో ఏడుపు ఉండుండి వినపడుతుంది. నేను చోద్యం చూస్తూ నిలబడిపోయాను కొంచెం సేపటికి గుంపు చెదిరిపోయింది చొక్కాతో కళ్ళు తుడుచుకుంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ, మిగిలిపోయాడో అబ్బాయి ఇంతవరకూ అతన్నాటలు పట్టించిన అబ్బాయిలు అతనికి సరి అయిన పేరులే పెట్టారనిపించేటట్టున్నాడు

నాకు జాలివేసింది. ఎందుకో తెలియకుండానే అతనికి దగ్గరగా చేరాను నన్ను చూసి బెదిరిపోయాడు. చెయ్యి పట్టుకోబోయాను

"వద్దు... నన్ను ముట్టుకోకు నా నలుపు నీకంటుకుంటుందేమో!"

గుండెలలో దేవినట్లయిందతని మాట

లకి, "ఫరవాలేదు కానీ ముందు నువ్వు ఏడుపు మానెయ్ " జాలిగా అన్నాను

అతని దుఃఖం కట్టడానికి చాలా సేపే పట్టింది

"నీ పేరేమిటి?'' మెల్లగా అడిగాను

"భాస్కరమ్-" వెక్కిళ్లడ్డుపడ్డాయి "కాని–నన్నెవరూ అలా పిలవరు "

"ఇంట్లోనో ?"

''అక్కడా నన్నెవరూ నా పేరుతో పిలవరు "

నా హృదయం జాలితో తొణికిస లాడింది భాస్కరం నాకంటె చిన్న వాడే ఒకటో రెండో సంవత్సరాలు నేను సెకండ్‌ఫారమూ అతను ఫస్ట్ ఫారమూ

జాలినుంచి స్నేహం పుడుతుంది కాబోలు !

నేనూ అతనూ స్నేహితులం ఐపో యాము– ఆ క్షణాలలో అలాగ

''మనం స్నేహంగా ఉందాం. ఏం?" అని నేనడిగేసరికి భాస్కరం నన్ను నమ్మలేనట్లు కళ్లు పెద్దవిచేసి చూశాడు

మరీ జాలివేసిందతని పరిస్థితిమీద

అతనిపట్ల–అవ్యక్తమైన ఆప్యాయత వెల్లివిరిసింది నాలో

సాయంత్రం స్కూలు వదలగానే యిద్దరమూ కలుసుకునేవాళ్లం

"ఏటివొడ్డుకి వెళ్దామా ?"

"చీకటిపడనీ ''

"ఎందుకూ ?"

"నేను రోడ్డుమీద వెళ్తూంటే నన్ను నలుగురూ ఎలాగో చూస్తారు నాతో తిరిగితే నీవంక కూడా అలాగ చూస్తా నగా..." అనేవాడు

నాకు మాత్రం భాస్కరంతో తిరగా లనిపించేది కారణం యిది అని నాకూ తెలియదు అతనిమీద స్నేహభావం కంటె జాలే ఎక్కువకాబోలు...అతనేం చెప్పినా కాదనాలనిపించేది కాదు.

క్యారమ్స్ ఆడుకుని - చీకటిపడు తూంటే యిద్దరమూ షికారు బయలుదేరే వాళ్లం దీపాలు లేక చీకటిగా ఉన్న చోట నడుస్తూంటే "నేన్నీకు కనిపిస్తు న్నానా ?" అని దీనంగా అడిగేవాడు. బదులు చెప్పడానికి నా నోరు ఓ పట్టాన పెగిలేది కాదు

"ఏమిటి నీ ప్రశ్న ?" చిరాకుపడే వాడిని అతనిమీద

"అదికాదు మా యింట్లో- చీకట్లో నేను కనపడనంటారు అందుకని..."

నాకు ఏడుపే వచ్చేది

భాస్కరం చేతిని గట్టిగా పట్టుకుని- ''నాకు చక్కగా కనపడుతున్నావు వాళ్లే అబద్ధమాడి ఉంటారు,'' అనే వాడిని

"నిజంగా నువ్వెంత మంచివాడివి రామారావ్!'' పొంగిపోయేవాడు

భాస్కరం అల్పసంతోషి. నిజం చెబితేనే అంత మురిసిపోతారా ఎవ రయినా ?

మా స్నేహం వయసు పోసు కుంటూంది.

భాస్కరం నా కంటికి నల్లగా కనిపించడంలేదు మామూలుగానే కనిపిస్తున్నాడు. నిరంతర సాహచర్యం వల్లా స్నేహం వల్లా అయి ఉండవచ్చు

అతను వయసుకి మించిన మాటలు మాట్లాడేటట్లనిపించేది నా కప్పుడప్పుడు బాలా ఎదిగిపోయినట్లు చిత్రంగా గంభీరంగా మాట్లాడేసేవాడు నాకు మతి పోయినట్లుండేది వినడానికి

ఓనాడు హటాత్తుగా అన్నాడు— నన్నిక భాస్కరం అని పిలవకు."

"ఏం ?"

"అ పేరు నా పేరులా ఉండదు "

"మరెలా ఉంటుంది ?''

"కొత్తగా ఎవరిదో పేరులా "

"అయితే— ఏమని పిలుస్తే నీకు బాగుంటుంది?"

"నల్లతంబి అని "

"నల్లతంబి !"— "ఛీ ! బాగులేదు. అదేం పేరు?"

"మా చిన్న మావయ్య— మద్రాసు మావయ్య చెప్పాడు నా కాపేరే బాగుంటుంద౨ అరవంలో నల్లతంబి అంటే మంచి తమ్ముడని అర్థమట...''

"కాని .."

''ఏం ? నేను నీ తమ్ముణ్ణి కాను ?"

"... .."

"ఓ మాట చెప్పేదా ?" రహస్యం చెప్పబోతున్నట్లు చూశాడు

"చెప్పు—"

"నాకు అమ్మ లేదు తమ్ముడులేడు కాని— అన్నవి నువ్వున్నావ్.

నాకే అమ్మ ఉంటే— నేను నల్లగా ఉన్నా ముద్దుగా బుజ్జీ అని పిలిచేదేమో! అన్నయ్య ఉంటే ప్రేమగా తంబీ అని పిలిచేవాడే కద ?"

"ఐతే ఏమంటావు ?"

"నన్ను నల్లతంబీ అని పిలవ్వూ ? నేను బాధపడను అసలు నువ్వేలా పిలిచినా నాకెంతో బాగుంటుంది నిజంగా ''

''......"

"నాకు పేరుపెట్టిన అమ్మా లేదు, నాన్నా లేడు మావయ్యగారింట్లో గతిలేక బతుకుతున్నాను. వాళ్ళందరికీ నేనంటే చులకన. నల్లగా ఉంటానని హేళన, అసహ్యం చివరికి టీచర్లు కూడా నన్ను బ్లాక్ బాయ్ అంటారు. నన్నెవరూ దగ్గరకి రానివ్వరు— నువ్వు తప్ప ''

కన్నీళ్లతో భాస్కరం చెబుతూంటే నేను కూడా ఏడుపాపుకోలేకపోయాను మనసు ద్రవించిపోయింది

అతని అభ్యర్థనను తిరస్కరించలేకపోయాను

గొంతు వణుకుతూంటే ''నల్లతంబీ!" అని పిలిచాను తొలిసారిగా

అతను నన్ను ఆప్యాయంగా చుట్టుకు పోయాడు

"అన్నయ్యా! నువ్వు నాకు జీవితాంతమూ ఉండిపోవాలి."

"తప్పకుండా" వాగ్దానం చేశాను

*　　*　　*

నల్లతంబి తెలివయినవాడే ఏదయినా యిట్టే గ్రహించేవాడు కాని— మార్కులు మాత్రం బాగా వచ్చేవి కావు బొటాబొటిగా పాసుమార్కులు తెచ్చుకునేవాడు ఓ సారి ఆ విషయం ఎత్తాను.

"ఏం చేసేది? పుస్తకం తెరిస్తే చాలు క్లాసురూము గుర్తుకొస్తుంది బ్లాక్ బోర్డ్ నన్ను వెక్కిరిస్తున్నట్లెదురౌతుంది బ్లాక్ బోయ్ అని మాస్టారు పిలుస్తున్నట్లనిపిస్తుంది నలుగురు కుర్రాళ్ళూ నన్ను నల్లవెంకన్నా అంటున్నట్లు వినిపిస్తుంది ఇక చదువు సాగదు. పుస్తకంమీద దృష్టి నిలవదు పాఠాలు బుర్ర కెక్కవు"

జాలివేసేది

నల్లతంబిని రక్షించాలని ఆవేశపడేవాడిని కాని— ప్రపంచమంతా అటు. నేనొక్కడినీ నల్లతంబి వైపు అంత ప్రపంచంనుంచి అతన్ని కాపాడడం నా ఒక్కడి తరమూ ఔతుందా?"

'పగలు— నన్ను చూసినవాళ్ళు నవ్వుతారు రాత్రి నన్ను చూస్తే దొంగేమో అనుకుంటారు. మరెలాగ నేను తిరిగేది?"

శూలాల్లాగా, శరాల్లాగా గుచ్చుకునే వతని మాటలు నా గుండెలలో అతన్ననునయించాలన్న సంగతే మరచిపోయేవాడిని తీవ్రమయిన సంఘర్షణకు లోనవుతూ

*　　*　　*

సమాధానం చెప్పలేని ప్రశ్నలు వేసేవాడు

ఓసారి రోడ్డుమీద నడుస్తున్నాం అతనూ నేనూ

నలుగురు పోలీసులు కాపలాగా అటూ యిటూ ఉండి— దొంగలను కాబోలు నడిపించుకు వెడుతున్నారు

"ఆ దొంగలని చూడు"


"చూశాను"

"అందరూ నల్లటివాళ్ళే!"

"......" మౌనం దాల్చాను—కాదన డానికాస్కారం లేక

"సాధారణంగా దొంగలందరూ నల్లగానే ఉంటా రెందుకని?"

"దొంగలలోనూ తెల్లటివాళ్ళుంటారు. కాకపోతే మన ప్రాంతంలో నల్లటి మనుషుల సంఖ్యే ఎక్కువ కనుక— దొంగలలోనూ తెల్లటివాళ్ళు అరుదుగా కనిపిస్తారు అంతేకాని మనిషి రంగుకీ అతని స్వభావానికీ ఏవిధమయిన సంబంధమూ ఉందనుకోను." కావాలనే కంఠంలోకి కర్కశత్వం అరువు తెచ్చుకున్నాను.




కనీసం అలాగయినా అతని ఆలోచనా ధోరణికి ఆనకట్ట వేయడం సాధ్యపడుతుందేమో అని

"నీకు నేనంటే యిష్టం అందుచేత పక్షపాతంతో నా నలుపు రంగుని సమర్థించబోతావు—"

"ఆదేమీలేదు నేను నమ్మిన నిజాన్నే చెప్పాను"

"సరే నువ్వు నమ్మని నిజాన్ని చెబుతాను విను." అంటూ ప్రారంభించాడు ఉదయం నేను లేచేసరికే యిల్లు గందరగోళంగా ఉంది కారణం— రాత్రి మా మామయ్య జేబులోంచి పదిరూపాయల నోటు మాయమైందట మామయ్య జాగ్రత్తమనిషి కనుక ఆ నోటు యింకెక్కడా కాక యింట్లోనే పోయిందని తేల్చి చెప్పాడు

ఇంటిదొంగ ఎవరని ఆరాలు తీయడం జరిగింది దొంగతనం జరిగిన తీరునిబట్టి నౌకర్లూ పైవాళ్ళూ కాక యింట్లో పిల్లలే తీశారన్న నిర్ధారణకు వచ్చాడు మామయ్య

శేఖరం బావ—మంజుల—నేను—మా ముగ్గురిలోనూ ఎవరో తేలాలన్నాడు మామయ్య చివరకు ఎవరిని దొంగగా తేల్చాడో తెలుసా?"

"శేఖరం అయి ఉంటాడు సిగరెట్లు కాలుస్తాడు. క్లాసులెగ్గొట్టి సినిమాలకి వెళ్తాడు అటువంటి పనులకి డబ్బులు సవ్యమైన మార్గంలో రావు అందుచేత శేఖరం—"

"కాదు—"

"మంజులా?"

"ఉహూ" అతని కళ్ళల్లో నీరు తిరిగింది "నేనుట! ఎందుకంటే నేను దొంగలాగే ఉంటానట! నా రంగూ రూపూ అవే చెప్తాయట నేను దొంగ వెధవనని.

ఒరేయ్! నాకు తెలుసురా— నువ్వొట్టి దొంగవెధవ్వి పచ్చి కేడీవి. అమావాస్యనాడు పుట్టావురా...అందుకే నల్లగా ఉన్నావు దొంగతనం నేర్చావు నాకు తెలుసు... నువ్వు గజదొంగ వౌతావు— అంటూ నా వీపు వాతలు తేలేలా బెత్తంతో బాదాడు మావయ్య"

"తంబీ!"

"నిజంగా నేను దొంగతనం చెయ్యే లేదు మావయ్యే అన్నట్లు అమావాస్య నాడు పుట్టడమూ నల్లగా ఉండడమూ నిజమేమో కాని- దొంగబుద్ధులు నేర్చు కోడం మాత్రం అబద్ధం నేనెంత ఏడ్చినా ఎవరు నమ్ముతారు? ఎలా నమ్ముతారు? నేను నల్లగా ఉంటాను. అంచేత నేనేం చెప్పినా నమ్మరు. శేఖరం తెల్లగా ఉంటాడు. అంచేత వాడి మాటలే నమ్ము తారు.

తంబి మనసు నాకు తెలుసు.

నేను తప్ప మరో మనిషంటేనే పుట్టెడు భయం ఆత్మన్యూనతా భావంతో- మరో మనిషితో మాట్లా డ్డానికే జంకుతాడు. ఆశ్రయం యిచ్చిన ఆ యింట్లో- తంబి దొంగతనం చెయ్యడు గాక చెయ్యడు.

ఆ నమ్మకం నాకుంది. కాని-ప్రపంచా న్నెలా నమ్మించగలను?

"పోన్లే తంబీ నిజం యివాళ కాక పోతే రేపయినా బయట పడక మానదు..."

"కాని- యివాళ నేను పడిన నిందా దెబ్బలూ వీటి సంగతేమిటి? నల్లగా— ఉండబట్టే కదా అనవసరంగా..."

"ఆ నలుపు నీ వొంటిది కాదు. వాళ్ల మనస్సుది" తంబి చేతిని మృదువుగా నొక్కి— "కాఫీ తాగి పోదాం పద." అన్నాను

ఇద్దరమూ టిఫిన్ ముగించి రోడ్డు మీదకు వచ్చాం.

చిన్న గుంపు- ప్రొసెషన్‌లా రోడ్డు ఆక్రమించుకుని వస్తోంది

గుడ్డమీద ఏవో అక్షరాలు... పాటలు... అరుపులు...

దగ్గరయ్యాక తెలిసింది. వాళ్లు కుష్ఠు రోగులు!

ఏసుక్రీస్తుమీద పాటలు పాడుతూ సామూహికంగా యాచిస్తున్నారు

ఇద్దరమూ చూస్తూ నిలబడ్డాం.

వాళ్ళు మమ్మల్ని దాటిపోయారు. మేము నడవసాగాము

"రామారావ్!"

"ఊఁ."

"కుష్ఠువాళ్ళని చూశావుకదూ..."


"ఊఁ"

"నల్లటివాళ్ళకే ఆ జబ్బు వస్తుందా?"

"నాకు తెలియదు."

"ముష్టివాళ్లు కూడా ఎక్కువగా నల్ల గానే ఉంటారు"

"నువ్విలాటి పిచ్చిమాటలు మాట్లా డితే నాకు కోపం వస్తుంది"




అతనికి సమాధానం చెప్పలేక-కోపం తెచ్చుకున్నాను

తంబి యిటువంటి గడ్డుప్రశ్నలే వేసేవాడు. నేనతనికంటె పెద్దవాడినే అయినా ఆ ప్రశ్నలకి సరయిన జవాబులు చెప్పగలిగే తెలివితేటలు నాకు మాత్రం ఎక్కడివి?

తంబితో నేను స్నేహంగా ఉండడం మా యింట్లోవాళ్ళకి నచ్చేదికాదు.

"ఆ కర్రిమొద్దుతో నీకు నఖ్యమేమిటి? నీ క్లాసూ కాదు, కులమూ కాదు," అనేవారు. నేను సమాధానం చెప్పేవాడినికాను నాలుగుసార్లు చెప్పి విసుగెత్తి మావాళ్లే ఊరుకున్నారు

స్కూలులో కూడా నేనూ తంబీ కలుసుకుంటే కుర్రవాళ్లు గేలిచేసేవారు బ్లాక్‌బోర్డూ, చాక్‌పీసూ అంటూ నేనేమీ తెల్లగా ఉండను నలుపు కాదంతే. చామన చాయ తంబి పక్కనుంటే నేను తెల్లగా కనిపిస్తాను కాబోలు ఎవరి మాటలో విని తంబి స్నేహాన్ని వదులుకోవడం నాకిష్టంలేదు నేను కొంచెం మొండివాడిని మొదటినుంచీ.

మా పక్కింటివాళ్ళకి చక్కని పాప ఉంది.

రబ్బరు బొమ్మలా ముద్దుగా బొద్దుగా ఉంటుంది.

ఆ పాపంటే నాకు చాలా యిష్టం. పెద్ద కళ్ళతో తమాషాగా చూస్తుంది. చిక్కని జుత్తు- వంకులు తిరిగి, పాప కదులుతూంటే ముఖంమీద పడుతూ ఉంటుంది. మూర్తి నిజంగా చిన్న సున్నాలా ఉంటుంది. అప్పుడప్పుడు ఆ పాపకి చాక్‌లెట్లిస్తూ ఉంటాను. అందు చేత నేను పిలిస్తే పరుగెత్తుకొస్తుంది. నా తరవాత చిన్నపిల్లలిక లేరు మా వాళ్ళకి. ఆ పాపను చెల్లిగా భావించు కుంటాను. బంగారుపాప అని పేరు కూడా పెట్టాను నేను.

ఓసారి ఆ పాపతో ఆడుకుంటు న్నాను- యింటిముందు రోడ్డుమీద నా చుట్టూ తిరుగుతూ ఆడుతూంది పాప

తంబి వచ్చాడు పాపని తదేకంగా చూశాడు

"పాపనెత్తుకుని ముద్దుపెట్టుకోవాలని ఉంది" అన్నాడు

"అలాగే "

"పాపా !" చిటికె వేస్తూ పిలిచాను

తిరుగుతున్నదల్లా ఆగి దగ్గరకు వచ్చి నా చెయ్యి పట్టుకుంది.

"అన్న !" తంబిని చూపాను

ఒక్కసారి చూసి దృష్టి తిప్పేసు కుంది

"నువ్వంటే ముద్దు— ముద్దిస్తాడు . వెళ్ళు—'' ఎత్తుకుని తంబికందించ బోయాను నా చేతుల్లోంచి జారిపోయి- నన్ను విదిలించుకుని పరుగెత్తింది తూనీగలా

"పాపా !" గట్టిగా పిలిచాను.

నాకు తెలుసు- యీ సంఘటన తంబిని తక్కువేమీ బాధపెట్టదు.

''నేను లాను-" సమాధానం చెప్పేసి తుర్రుమంది

దీనంగా నిలబడ్డాడతను పాప వెళ్ళిన దిక్కే చూస్తూ.

''పాప ఎంత అందంగా ఉంటుందో అంత పెంకిది. పైగా— కొత్త "

"అదికాదులే ఈ పాపే కాదు, ఏ పాపా నా దగ్గరకు చేరదు "

"అలా మాట్లాడకు నాలుగురోజులు అలవాటయితే—"

"ఎన్నాళ్ళయినా అంతే దేవతా పాపలు రాక్షసుల దగ్గరకి వస్తారా ?"

ప్రశ్నార్థకంగా చూశాను

"తెల్లటివాళ్ళు దేవతల అంశ, నల్లటి వాళ్ళది రాక్షసుల అంశ "

"ఎవరు చెప్పారు ?"

"నాకు తెలుసు ''

'ఇలాటి పిచ్చివిషయాలు నీకింకా ఎన్ని తెలును ? చెప్పు "

"అమృతం తెల్లగా ఉంటుంది అది తాగడంవల్ల దేవతలు తెల్లగా ఉంటారు దేవతల పాపలు కూడా తెల్లగా ఉంటారు—''

''ఐతే యికనేం ? ఓ చెన్నుడు అమృతం సంపాదిద్దాం "

"ఎక్కడ ?"

''ఏ మందులషాపులోనో దొర కదూ ?"

"దొరకదు " నిరాశ నిండిన స్వరంతో అన్నాడు

"ఏతే యిక దానిగురించి ఆలో చించడం అనవసరం. లోపలికి పద, క్యారమ్స్ ఆడుకుందాం ''

ఇంకా ఆ విషయం వదలలేదు తంబి. "ఓ విధంగా- పాప నన్ను ముట్టుకోనీక పోవడమూ మంచిదే.''

''—" నేనేమీ అనలేదు

''బంగారు బొమ్మలాటి పాప—




నేను ముట్టుకుంటే నల్లబడిపోతుందేమో! అంత చక్కని అందమే. సందేహం లేదు నాలాటి నల్లటివాడు దగ్గరకు వస్తేనే మాసిపోతుంది ''

నేను మౌనంగా ఉండిపోయాను ఒక్కొక్కప్పుడు ఏ మాటా చెయ్యలేని పని మౌనం చేయగలదు.

''నీకు కోపం వచ్చిందా ?''

''......''

''నాకున్న ఒకే ఒక మనిషివి నువ్వు. స్నేహితుడివీ, సోదరుడివీ అన్నీ నువ్వే. నీకు కోపంవస్తే నేనే వెళ్లి సముద్రంలోనో పడి చచ్చిపోవాలంతే, మరో తోవ లేదు '' దీనంగా అన్నాడు.

"అతే నేను చెప్పినట్లు విను"

"చెప్పు."

"బుద్ధిగా, నాతో వచ్చి క్యారమ్స్ ఆడు."

తంబి నా చెయ్యి పట్టుకుని నడిచాడు

ఇద్దరమూ క్యారమ్స్ ఆటలో మునిగి పోయాం.

తంబికీ నాకూ ఎవరూ విడదీయలేనంత స్నేహం అయిపోయింది.

అప్పుడప్పుడు నేనతనికి చదువు చెప్పేవాడిని

తంబిని నిజంగా తమ్ముడిలాగే చూసుకునేవాడిని.

విచిత్రంగా— ప్రపంచానికి నల్లగా కనిపించే తంబి- నా కంటికి అలాగ అనిపించేవాడు కాదు పైగా అందంగా కనిపించేవాడు.

కొంచెం జాగ్రత్తగా చూడగలిగితే- అతని ఉంగరాలజుత్తు ఎంత చక్కనిది? తరువాత- అతని శరీరం దృఢమైనదీ, సౌష్టవమైనది, కండలు తిరగకపోయినా- ఎలా ఉండవలసిన అవయవాలు అలా ఉండి శరీరం సౌష్టవంగా ఉండేది

ఎందుకనో యివన్నీ మిగిలినవారి కళ్ళకు కనిపించవు. చూడగానే కనిపించేదతని నలుపు నిజమే, ఆ నలుపు నిగనిగలాడదు. అందంగా ఉండదు ఆ నలుపు- అందాన్ని చంపే నలుపు తప్ప పెంచేది ఎంతమాత్రమూ కాదు. అంతమాత్రాన అతన్ని మనిషిగా పరిగణించకపోవడం ఎంత అన్యాయం? ఎంత గుడ్డితనం!?

అతని అత్తయ్యా, మామయ్యా,... బావా,- అందరికీ తంబి అంటే హేళనే. అనాథ బాలుడిలాగా పెరుగుతున్నా డా యింట తల్లీ తండ్రీ ఉంటే తంబికి యిన్ని కష్టాలూ, అవమానాలూ ఉండక పోయేవేమో!

ఇద్దరమూ పెరిగి పెద్దవాళ్ళ మౌతున్నాం

తంబి హైస్కూలు తరగతులు దాటే వాడు.

*  *  *

(సశేషం)



# నల్ల తంబి



ఇచ్ఛాపురపు రామచంద్రం

(గత సంచిక తరువాయి)

## 2

తరగతులు మారినా తత్వం మారదేమో!

వయసు పెరిగినంత తొందరగా వివేకం పెదగదేమో!

దెబ్బమీద దెబ్బ మరింత బాధను కలిగిస్తుంది. దెబ్బలు తగిలీ తగిలీ కాయకట్టుకుపోయి యిక ఎన్ని తగిలినా బాధ ఉండడం మానేస్తుంది. కాని-తంబి రాను రానూ మరీ సున్నితం ఐపోతున్నాడు. అనుభవాల పరంపరలూ, అవమానాలూ అతని హృదయాన్ని బండగా చేయలేకపోయాయి.

ఈ ప్రపంచంలో బ్రతకాలంటే ప్రతి

మనిషి కొంత రాటుతేలాలి, తప్పదు. ముఖ్యంగా తంబిలాటి మనుషులు బండ బారితే తప్ప చుట్టువక్కల మనుషులు బ్రతకనివ్వరు. తూనీగల రెక్కలు విరిచి- తోకకు దారం కట్టి ఎగరేసి ఆనందించే పసివాళ్ళ చర్యలకు అర్థం దొరకవచ్చునేమో కాని- ప్రయోజన రహితంగా ఎదుటివాడిని షోషణచేయ డమే వినోదంగా భావించే పెద్దవాళ్ళ చర్యలకు అర్థమూ ఆధారమూ కని పించవు.

నేను గమనించిన దేమిటంటే—

తంబిలో ఆత్మన్యూనతాభావం (ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్) చోటుచేసు కుని పెరుగుతూంది.

మనిషికి- దీన్ని మించిన శత్రువు లేదు బాహ్య శత్రువులను జయించడం సాధ్యపడవొచ్చు కానీ యీ అంతశ్శత్రు వుని ఓడించడం ఓ పట్టాన సాధ్యపడదు. క్రమక్రమంగా మనిషి పతనానికి మెట్లు తవ్వేతుంది ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్.

తంబి ప్రవర్తన. అతని గతం— యివన్నీ నా అనుమానాలను నిజం అని నిరూపించి వదిలాయి.

హైస్కూలు చరిత్ర పునరావృతం అయింది.

కాకపోతే అతన్ని నలుగురూ బ్లాక్ మాన్ అని ఉదహరిస్తున్నారు.

బ్లాక్ మాన్... డార్క్ ఫిగర్... కాలేజీలో నిక్ నేమ్స్.

అతని అసలు పేరు తెలుసుకునే ప్రయత్నం ఎవరూ చెయ్యలేదు.

అతనికి ఓ పేరంటూ ఉండడం అవ సరంగా అనిపించేదేమో వాళ్ళకి. ఎవరికి తోచినట్టు వారు- తమ తెలివి తేటలుపయోగించి- తంబికి నామకరణం చేసేస్తున్నారు.

అతనికి జరగకూడని అన్యాయాలు జరిగిపోతున్నాయ్.

నల్లగా ఉండడంవల్లన అతనిది కాని కులాన్ని ఆపాదించారు.

అతను కూర్చునే బెంచీమీద ఎవరూ కూర్చోడంలేదు.

అతన్ని ప్లేగ్రౌండ్‌లో కూడా వెలి వేస్తున్నారే తప్ప ఎవరూ తమ టీములో చేరనివ్వడంలేదు

ఇవన్నీ అతను నాకు చెప్పకుండా నేను గ్రహించిన విషయాలు.

అతనికి సీనియర్ నయినా యిద్దరిదీ ఒక్కటే కాలేజీ.

కొన్ని విషయాలు తంబి చెబు తూంటే నాకు దుఃఖం వచ్చేది.

"నేను తెల్లబట్టలు వేసుకుంటే తప్పా?" అమాయకంగా అడిగేవాడు.

నాకు తెలుసు. అతని అమాయకపు ప్రశ్న వెనుక సహృదయుడి గుండె కోసే విషాదభరితమైన అనుభవం ఏదో ఉందని.

నేను మాట్లాడకపోయినా అతను ఊరుకునేవాడుకాదు. తన బాధను వెళ్ల బోసుకునేవాడు. గుండెలలో కుమిలి పోవడంకంటె అలాగ బయటపడడం

వల్ల కొంత సాంత్వన అతనికి లభిస్తుం దన్న భావనకొద్దీ నేను తంబి మాటలు వినేవాడిని.

"తనకిష్టమయిన బట్టలు వేసుకునే అధికారం ప్రతివాడికీ ఉంది."

"మరి— నన్ను టినోపాల్ అంటారేం తెల్ల బట్టలు వేసుకుంటే ?"

ఏం చెప్పగలను ?

ఎందరి నోళ్లు మూయగలను ?

ఎందరికి జవాబు చెప్పగలను నేనొక్కడినీ ?

"నా వొంటిరంగుకి- రంగుబట్టలు ఎబ్బెట్టుగా ఉంటాయి. తెల్లబట్టలు వేసుకుంటే వెక్కిరిస్తారు. ఏం చెయ్యాలి నేను ?"

"వాళ్ళమాటలు వినిపించుకోకు."

"ఎలా ? ముఖంమీదకి వచ్చి మరీ అంటూంటే..."

"ఈడ్చి లెంపకాయ వెయ్ "

"ఇంకేమన్నా ఉందా ? నేనొక్కడిని కొడితే పదిమందీ ఏకమై నన్ను చంపేస్తారు ఏమీ చెయ్యకుండానే నేనంటే గుర్రుగా చూస్తారు—"

తంబి మాటలో ఆవగింజంతయినా అబద్ధం లేదు.

తంబికి నేనేం తరుణోపాయం సూచించగలను ?

అటువంటప్పుడు నేనేదో కథ మొదలుపెట్టేవాడిని— అతని మనసుని మళ్ళించడానికి. దెబ్బతగిలి ఏడుస్తున్న పిల్లవాడిని- మంచి మాటలతో మరిపింప జేసే పెద్దవాడిలా ప్రవర్తించే వాడిని.

తంబి నాకంటే చిన్నవాడే. కాని మా వయస్సులలోని వ్యత్యాసం అర్థే ఎక్కువేమీ కాదు. ఐనా- అతనికోసం నేను చాలా పెద్దవాడినైపోవలసి వచ్చేది. కాదు .. తంబి... నాదగ్గర పసిపిల్లవాడిగానే మిగిలిపోయేవాడు.

నాకు తెలుసు... నేను తీయని అబద్ధాలు చెప్పి అతన్ని మోసం చేస్తున్నాను. అతనికోసం- ప్రియంగా ఉండేవే అయినా- అసత్యాలు చెప్పడం అలవాటు చేసుకుంటున్నాను. ఇది- మంచిపని కాదని తెలిసినా ఏమీ చెయ్యలేక పోయేవాడిని.

ఒకడు- మరొకణ్ణి - ఒకసారి మోసంచేయగలడు.

పదిసార్లు మోసం చేయగలగవచ్చు- మరీ సమర్థుడైతే. కాని- ఏ మనిషీ మరో మనిషిని జీవితాంతమూ మోసం చేస్తూ గెలవలేడు పరిస్థితులో... వ్యక్తులో... ఆత్మవివేకమో ఏదో ఒకటి ఆ ఆటను ఆపి తరుతుంది. తంబిని తీయని అసత్యాల ప్రాకారంలో బంధించి ఉంచాలన్న నా ప్రయత్నం- అతని సుఖం కోసమే.

ఆట కట్టు అయ్యేవరకూ ఆడి తీరాలంతే, గత్యంతరం లేదు

కాలేజీలో చేరిన కొంచెం కాలానికి తనొక విషయం చెప్పాడు.

"స్వప్న- నీకు తెలుసు కదూ ?"—

స్వప్నని మా కాలేజీలో తెలియనివా రుండరంటే అతిశయోక్తికాదు ఆమె అందం అటువంటిది. చాలా చక్కని దేహచ్ఛాయ ఆమెది వెన్నా వెన్నెలా తేనే కలిపి చేసినట్లు చక్కని రంగు ఆమెది. సహజంగా అందమయిన ఆ అమ్మాయి అతి చక్కగా అలంకరించు కుంటుంది. పైగా- ఉన్న అందాన్ని వెయ్యింతలు చేసి ప్రదర్శింపజేసే వయసు మున్మురం, ఇక ఆమెకు గుర్తింపుకి లోట్లూ మినహాయింపులూ ఏమిటి ? కాలేజీలో చదువుతూ స్వప్న తెలియలేదంటే స్టూడెంట్ జాతికే అవ మానం. ఆమె అందం అంతటిది. ఆ స్వప్న తంబికి క్లాస్‌మేట్. ఇద్దరిదీ ఒకటే గ్రూప్

"తెలుసు—" అన్నాను నేను.

"అందాన్ని చూడడం కూడా నేర మేనా ?"

ఆచనలో పడ్డాను.

కథ్రలాసే రచయితలలో ఒక్కొక్క రచయితది ఒక్కొక్క టెక్నిక్. అలాగే కథలు చెప్పే- మాటలాడే మనుషులదీ ఒక్కొక్క విధానం

తంబి అసలు విషయం ముందు చెప్పడు. చెప్పకుండా ప్రశ్నలు వేస్తాడు.

"అందాన్ని చూడడం నేరమని యింతవరకూ ఏ న్యాయశాస్త్రమూ చెప్పి నట్లు నాకు తెలియదు."

"అందాన్ని చూడడానికి కూడా ఏవయినా అర్హతలుండాలా ?"

"ఉహుం ... రెండు కళ్ళూ ఉంటే చాలనుకుంటాను."

"మరి - నా విషయంలో అలా జరిగిందేం ?"

"ఎలాగ ?"

చెప్పసాగాడు తంబి. "స్వప్న చాలా అందమయిన అమ్మాయి అందరూ ఆమెవంక పదేపదే చూస్తారు ఆమె వంక చూసే స్టూడెంట్సెవరూ ఆమె అంత అందమైనవారు కారని నిశ్చ యంగా చెప్పగలను. వాళ్ళందరూ తనను తదేకంగా చూస్తున్నా ఏమీ అనేది కాదామె.

అది నాకు ధైర్యం కలగజేసింది.

ఒక్కసారి స్వప్న ముఖంలోకి చూశాను.

ఎంత అందం !


ముఖ్యంగా ఆ చక్కని కన్నులు... పోల్చేందుకు ఉపమానాలే లేనంత గొప్పది.

నేను చూస్తున్న క్షణంలోనే ఆమె నన్ను చూసింది.

నన్ను నేను మరచిపోయాను.

నేనెక్కడున్నానో ఏంచేస్తున్నానో నాకు తెలియదు.

స్వప్న సౌందర్యం నాలో విచిత్ర మయిన అనుభూతినీ వింత పరవశాన్నీ




కలుగజేసి వదిలింది. ఆ అనుభవంలో సర్వమూ మరచిపోయాను

ఒక విధమయిన ఆరాధనతో ... ఏకాగ్రతతో... అలాగ ఉండిపోయాను. ఆ మైమరపునుంచి..." ఆగాడు తంబి

ఈసారతని స్వరం దీనంగా మారిపోయింది. త్రుళ్ళిపడ్డాను.

"ఏ ఆఫ్రికా అడవులలోకో పోయి వెతుక్కోరాదూ సరయిన జోడీకోసం."

అది స్వప్న కంఠం.

క్లాసు గొల్లుమంది.

"బ్లాక్ షీప్!" శపించినట్లు అరిచింది స్వప్న.

ముఖం దించుకున్నాను.

ఉన్నపళాన చచ్చిపోతే బాగుండుననిపించింది

వందమంది విద్యార్థులమధ్య నాకు జరిగిన అవమానమిది. ఇదివరకు ఎన్నిసార్లు అవమానాలపాలయినా — అవన్నీ దీనిముందు తీసికట్టే.

జీవితంలో మరిచిపోలేని మచ్చగా మిగిలిపోతుంది..."

తంబి కన్నులు కన్నీటితో నిండిపోయాయి.

ఊహించుకోనవసరం ఏమాత్రమూ లేకుండానే తంబి వ్యధిత హృదయాన్ని అతని కన్ను లతిస్పష్టంగా ప్రతిఫలిస్తున్నాయి.

నా మనసు ఆర్ద్రం ఐపోయింది.

జరిగిన అవమానం అతనికి కాదు. నాకే.

తంబికి తగిలిన గాయం చిన్నది కాదు. ఆ గాయాని కేమందులువేసి మాన్పగలనా అని ఆలోచించసాగాను.

కొన్ని నిముషాలు - మా మధ్య మౌనం.

మెల్లగా అన్నాను "తంబీ !"

అతను చూశాడు

"స్వప్న - సౌందర్యానిక కాణాచే. కాని-ఆమెకు గర్వం ఎక్కువ కారణం ఆమె అందమే యత్ర రూపం తత్ర గుణాః, అన్నది ఆమెవద్ద భంగపడి పోయింది.

తాజ్ మహలు అందాలని చూడడానికి దాన్ని కనుక్కోగలిగే తాహతుండ నవసరంలేదు.

ఆకాశాన్నందుకోగలిగిననాడే ఇంద్ర ధనుస్సుని చూడాలన్న ఆంక్షేమీలేదు. చూడడానికి కళ్లూ, స్పందించే హృద యమూ ఉన్నవారెవరయినా సౌంద ర్యాన్ని దర్శించవచ్చు. అందాన్ని చూసే హక్కు అందమయినవారికే పరిమితంకాదు

సౌందర్య గర్వంతో మిడిసిపడు తూన్న స్వప్న-వాస్తవాన్ని గుర్తించ లేక ఏవో భ్రమలలో కొట్టుకుంటోంది. ఆమె ఒక్క విషయం - తన గర్వానికీ ఆధిక్యతకీ ఆధారం - సౌందర్యారాధ కుల సహృదయతే అని - గుర్తించగలి గితే - ఆమె అంత మూర్ఖంగా ప్రవర్తిం చదు..."

తంబి నోరు విప్పలేదు

మళ్ళీ అన్నాను నేను. "మనిషిని చంపిన నేరానికయితే శిక్ష ఉంది. మనసుని చంపే నేరానికి మనువు కూడా సరయిన శిక్ష చెప్పి ఉండడు తన శిక్షాస్మృతిలో. ఐతే - మనిషికంటే గొప్పవాడు న్యాయమూర్తి అయిన దేవుడు ఊరుకుంటాడనుకోను. భగ వంతుడి పంచాయితీలో అందరికీ సరయిన న్యాయమే జరిగి తీరుతుంది

ఇవాళ ఏ సౌందర్యాన్ని చూసుకుని స్వప్న కన్నూ మిన్నూ కానకుండా మిడిసిపడిపోతూందో ఆ అందం అశాశ్వతం. హఠాత్తుగా ఏ వ్యాధో వస్తే ఆమె అందమూ దానితోపాటే గర్వమూ శిథిలమై తీరక తప్పదు." కసిగా అన్నాను.

"రావ్ !" కంగారుగా చూశాడు తంబి "వద్దు రావ్. అలాగ శపించకు. నా కోరిక అదికాదు. అందం పది కాలాలపాటు పదిలంగా ఉండితీరాలి. స్వప్న ఏ నాటికీ అందగత్తెగానే మిగిలి ఉండాలి. సత్యం, శివం, సుందరమ్ సౌందర్యం లేకుండా ప్రపంచం ఉండకూడదు. సౌందర్యంతో పాటు కొంచెం సహృదయత కూడా ఉంటే .."

పిచ్చి తంబీ ! నీకు కోపంలేదు. పగలేదు. బొత్తిగా నిర్మల హృద యుడివి. అందుకే నిన్ని ప్రపంచం బ్రతకనీయకంలేదు.

అందాన్ని ఎంత వెర్రిగా ఆరాధి స్తాడో ! కాని - ఇతని ఆరాధన గుర్తించబడదు. నిర్దయగా తిరస్క రించబడుతుంది. అవమానించబడు

తుంది. ఇది తంబి దురదృష్టం. అతను నల్లగా ఉండకపోతే జీవితం తప్పకుండా మరోలా ఉండేది.

నాకు తెలుసు – తంబి యీ అవమానాన్ని బ్రతుకంతా మరచిపోలేడు. ఈ సంఘటన పొంచి ఉండి జీవితాంతమూ అతన్ని కాటువేస్తూనే ఉంటుంది. వయస్సులో – స్త్రీమూలంగా జరిగిన అవమానం–మగవాడు ఒకంతట మరచిపోలేడు. అది అతని జీవితం మీద పెద్ద దెబ్బతీస్తుంది.

దీనినుంచి తంబిని రక్షించడం ఎలాగ ?

సౌందర్యాన్ని ఆరాధించడమూ, ప్రేమించడమూ – యివి వయస్సు ననుసరించి ఉత్పన్నమయ్యే సహజ లక్షణాలు. వసంతఋతువుని వికసించకుండా, హృదయాన్ని ప్రేమించకుండా–శాసించడం ఏ మనిషికయినా సాధ్యమా ?

స్వప్న చేసిన అవమానంతో తంబిలో స్త్రీ అంటేనే భయమూ, ఏవగింపూ కలగవచ్చు. అలాగ అయితే అతను జీవితంలో చాలా కోల్పోతాడు స్త్రీని ద్వేషించే పురుషుడికీ, పురుషుని ద్వేషించే స్త్రీకి జీవితంలో లభించేది సగం అనుభూతి మాత్రమే అని ఎవరో వ్రాయగా చదివాను. సగం కూడా లభించదేమో అని నా అనుమానం.

ఆ సంఘటన జరిగాక కొన్ని రోజులు కాలేజికి వెళ్ళలేదు తంబి. నేనూ ఒత్తిడి చెయ్యలేదు.

కాలేజీ చదువయ్యేవరకూ అతన్ని సహవిద్యార్థులు పరిపరి విధాల గుండెల్లో యీటెలూ, బాకులూ దించుతూనే ఉన్నారు.

అతని వొంటిమీద పాలుపోస్తే విషం ఔతుందట !

సితా కావాలంటే – తంబి నీళ్ళల్లో చెయ్యి ముంచితే చాలట !

ఇలాగ.

తంబిమాత్రం చాలా శ్రద్ధగా చదవసాగాడు. ఇక చదివించడం తనవల్ల కాదనీ డిగ్రీ పూర్తిచేసుకుని అతని బతుకతను బతకాలనీ ముఖంమీదే చెప్పేశాడుట వాళ్ళ మామయ్య. అందుకని అతను చాలా మంచి మార్కులకోసం కష్టపడి చదవసాగాడు

అతని ప్రయత్నం ఫలించింది. డిగ్రీ పూర్తిచేశాడు – ఫస్టు క్లాస్‌తో. మంచి మార్కులు వచ్చాయి. అతన్నభినందించాను.

* * *

తంబి ఉద్యోగపు వేటలో పడ్డాడు. పడవలసి వచ్చింది.

అసలే గడ్డురోజులు...పైగా – డిగ్రీ పెద్ద క్వాలిఫికేషనేమీకాదు.

రికమెండేషనో లంచమో లేకపోతే డిగ్రీ స్వయంగా ఫ్యాన్ పోస్టునయినా సంపాదించలేని కష్టకాలం.

తంబికి రికమెండ్ చేసేనాథుడూ లేడు, లంచం యిచ్చుకోగలిగేశక్తిలేదు ఈ పరిస్థితుల్లో అతనికోపట్టాన ఉద్యోగం దొరుకుతుందా ?

పేపరులో వాంటెడ్ కాలమ్స్ చూడడం ... అప్లికేషన్స్ పంపుతూం డడం... ఇదే దినచర్య అయిపోయింది తంబికి వ్రాతపరీక్షలుంటే హాజరయ్యే వాడు. బాగానే వ్రాసేవాడు. కాని- ఇంటర్వ్యూకి పిలుపే వచ్చేదికాదు !

రోజులు దొర్లిపోతున్నాయి.

ఒకసారి కొంచెం మంచి పోస్టుకే పిలుపు వచ్చింది. తంబి ఇంటర్వ్యూకి వెళ్ళినవాడు వెళ్ళినట్లే వచ్చాడు-వెంటనే.

"ఏమైంది ?" అడిగాను.

"ఉన్నవి రెండు పోస్టులు. పది మందిని పిలిచారు. పదిమందిలోనూ ఆరుగురతి తెల్లనివారు. ముగ్గురు చామన ఛాయవారు..."

"ఐతే ?"

"ఆ తెల్లని వాళ్ళుండగా నా ముఖం చూసేదెవరు ? ఉద్యోగ మిచ్చేదెవరు ?"

నవ్వూ, ఏడుపూ కూడా వచ్చాయి ఏక కాలంలో. తంబిది అమాయ కత్వమా ? పిచ్చా ? ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సా ?

"నల్లగా ఉన్నంతమాత్రాన ఇంట ర్వ్యూకి హాజరవడం మానేస్తావా ! ఎంత చక్కని అవకాశం పోగొట్టు కున్నావు !...నేనే అయితే నల్లగాఉన్న వాడినే సెలక్టు చేద్దును."

"అందరూ నీలాగ ఆలోచించరు-"

"నీలాగా ఆలోచించరు," కఠినంగా అన్నాను

తంబి ఈ కాంప్లెక్షన్ కాంప్లెక్స్‌నుంచి ఎప్పటికి బయటపడి బాగుపడతాడో ! కొన్ని నెలల అనంతరం అతనికి ఉద్యోగం వచ్చింది - అదృష్టవశాత్తూ నేనుండే ఊళ్ళో అప్పటికే నాకు వివాహమైంది ఆఫీసువారి ధర్మమా అని మంచి క్వార్టర్సు దొరికాయి. తంబి మాతోటే ఉండేవాడు. ఉద్యోగస్తు డయ్యాడన్నమాటేకాని నా ముందు పసివాడిలాగే ప్రవర్తించేవాడు. విచి త్రంగా నా శ్రీమతిని అక్కా అని పిలిచేవాడు.

"అదేమిటి ?"

"అదంతే. నాకలా పిలిస్తేనే బాగుంటుంది."

నవ్వి ఊరుకున్నాం నేనూ, శ్రీమతీ.

కొంతకాలానికి తంబి ఆరోగ్యం చాలా చెడింది. మనిషి నీరసంగా తయా రవసాగాడు. డాక్టరు దగ్గరికి రమ్మంటే ఓ పట్టాన బయలుదేరాడు కాదు. చాలా బలవంతం చెయ్యవలసి వచ్చింది. భయ పడుతూ, సిగ్గుపడుతూ వచ్చాడు చివరికి.

"రక్తం చెడింది. బహుశా ఏవో మందులు తీసుకుని ఉండాలి. వాటికి ఆంటీడోట్స్ వాడాలి. కనుక-ముంగ

ఆ మందులేమిటో తెలుసుకోవాలి." రక్తపరీక్షచేసి చెప్పాడు డాక్టరు.

తప్పించుకోజూశాడు త.బి.

చాలా కఠినత్వం ప్రదర్శించాను - అయిష్టంగానే.

అప్పుడు బయట పెట్టాడసలు విషయం

"ఓ కొండవాడు కనిపిస్తే-అడిగాను. తెల్లగా అవడానికి మందులేమయినా యిస్తాడేమో అని. ఏభై రూపాయలు తీసుకని మందుయిచ్చాడు. అది వేసు కున్నాను."

తంబిమీద జాలితో నా హృదయం కరిగిపోయింది

అతని ముఖం చూడడానికే బాధ వేసింది

"మనుషులు తెల్లబడడానికి మందు లుంటాయనే నమ్మావా ?"

తలవంచుకుని మెల్లిగా అన్నాడు. "తెల్లవెంట్రుకలు నల్లబడడానికి మందు లుంటాయి కదా, అలాగే..."

ఏం చెప్పేదతనికి ?

డిగ్రీ తీసుకున్న తంబి-ఎంత అమాయకంగా ప్రవర్తించాడు !

ఆ మందు తీసుకుని డాక్టర్ దగ్గరకు బయలుదేరాను

రెండునెలలకు మళ్ళీ మామూలు మనిషయ్యాడు.

ఇంకెప్పుడూ అటువంటి పనిచెయ్య నని వాగ్దానం చేశాడు.

అతను ఉద్యోగంలో స్థిరపడ్డాడు.

విద్య, ఉద్యోగం ... యిక వివాహ పర్వం మిగిలిపోయింది.

స్నేహంమూలంగా తంబిమీద ఓ విధమయిన అధికారంతోపాటు బాధ్యత కూడా ఏర్పడిపోయింది అది అత నిచ్చినదే.

తంబి పెళ్ళిచేసుకోవాలి.

అప్పుడే అతని జీవితానికి నిండు తనం

వివాహం - స్త్రీకే కాదు పురుషుడికీ అత్యవసరమే.

పెళ్ళితో ఎవరి జీవితమయినా మలుపు తిరిగి తీరుతుందనే నా నమ్మకం.

ఒకవిధమయిన స్వార్థం ఏర్పడు తుంది మమతా బంధాలేర్పడుతాయ్.

నిజంగా యివి జీవితానికి చాలా అవ సరాలు ఒంటరి జీవితంవల్ల కలిగే విసుగునీ విశృంఖలతనీ తప్పించడానికి వివాహం ఓ చక్కని మార్గం.

నేను పెద్దరికం వహించవలసి వచ్చింది.

నాలుగైదు సంబంధాలు చూపించాను తంబికి.

ఏదీ కుదరలేదు.

కారణం తంబే.

ఒకసారి సీరియస్‌గానే అడిగాను - విసుగొచ్చి.



ఇంకేమీ అనలేక పోయానతని వైఖరి చూసి.

తంబి వివాహం - కాలం పరిష్కరించవలసిన సమస్యగా మిగిలిపోయింది. కాలమయినా యీ చిక్కుముడి నెలా విడదీస్తుందో అన్న కుతూహలం నాలో ఉండనే ఉంది.

## 3

ఒకనాడు_నేనెదురుచూస్తున్న శుభవార్త నా చెవిన పడనే పడింది.

"నేను వివాహం చేసుకోవాలనుకుంటున్నాను."

"సంతోషం. ఎవరిని?"

కొంచెంసేపు తటపటాయించి - సిగ్గుపడుతూ-మెల్లగా చెప్పాడు. "మాధవి"

ప్రశ్నార్థకంగా చూశాను

"ఔను... మాధవిని ప్రేమించాను. ఆమె నన్ను ప్రేమించింది. అన్నట్లు... నీకు యిదేమీ తెలియదుగా! వివరంగా చెబుతాను."

ఆనందం పట్టలేకపోయాను.

తంబి ప్రేమించాడు. ఆమె-మాధవి-తంబిని ప్రేమించింది!

అతను తన ప్రేమకథ చెప్పాలని చాలా ఉత్సాహంగా ఉన్నాడు. అతని కన్నులలో కొత్త కాంతులు తొంగి చూస్తున్నాయి. మనిషి హుషారుగా చైతన్యవంతంగా ఉన్నాడు. అదంతా నిశ్చయంగా ప్రేమ మహిమే. ప్రేమలో పడినవాళ్ళకి ప్రపంచం రంగు రంగులుగా కనిపిస్తుంది. వాళ్ళలోనూ కొత్త రంగులు బయటపడతాయి. నిస్సందేహంగా యివి తొలివలపు లక్షణాలే.

"సాయంత్రాలు... ఆఫీసు వదిలాక షికార్లు వెళ్ళడమూ, ఒంటరిగా బీచ్‌లో కూర్చుని కాలంగడపడమూ - రెండు మూడు నెలలనుంచీ అలవాటయింది. నేనీ అలవాటు చేసుకున్న వారం పది రోజులకి - నేను కూర్చునే చోటుకి కొంచెం దూరంలో ఓ అమ్మాయి వచ్చి ఒంటరిగా కూర్చునేది. ఆమె అతి చక్కనిది. బెంగాల్ జామిపండు రంగు ఆమెది చీకటిపడేవరకూ సముద్రాన్నీ కెరటాలనీ ఆకాశాన్నీ చూస్తూ కూర్చుని చీకటిపడేసరికి లేచి వెళ్ళిపోయేది. రోజులు గడుస్తున్నాయి.

ఇద్దరమూ పలకరించుకుందుకు—

ఆమెకు నామీద దయలేదు.

నాకు ధైర్యంలేదు.

కూర్చునేముందు కన్నులతో ఒక్కసారి చూసేదామె. నేను వచ్చానో లేదో చూడడానికన్నట్లు

ఒకనాడు - యిద్దరమూ కూర్చుని ఎవరి ఆలోచనలలో వారుండగా- హఠాత్తుగా వర్షం పట్టుకుంది

అనుకోకుండా యిద్దరమూ ఒక చెట్టుకింద షెల్టర్ తీసుకోసాగాం. ఆమెతో మాట్లాడాలని నాకు తహతహగా ఉంది. కాని-యీామె అందమైనది. స్వప్నలాగ దారుణమయిన శాపాలు విసురుతుందేమో అని భయం.

వర్షం త్వరగా తగ్గేటట్లు లేదు.

ఆమె కంగారుపడుతోంది విశాలమయిన ఆమె కన్నులలో భయం తొంగి చూస్తోంది. ఆమె భయపడుతున్నా ఎంతో అందంగా ఉంది.

జాలిపడుతూ-గొణిగాను- "మీరు-మీరు"

"నా పేరు మాధవి'' అందామె.

"నా పేరు భాస్కరమ్. మీదు... బెంగాలీలా?"

"ఒకప్పుడు. ఇప్పుడుమాత్రం నేను తెలుగుదేశపు దానినే."

"మీరు యింటికి వెళ్ళిపోవాలని తొందరపడుతున్నట్లున్నారు. ఈ రోడ్డు మీద రిక్షాలూ, టాక్సీలూ రావు. నేను కొంచెం ముందుకు వెళ్ళి పిలుచుకొస్తాను. మీరిక్కడ ఉంటారా?"

"ఒంటరిగానా! - ఊహుఁ పదండి. నేనూ మీతో వస్తాను.''

"చాలా తడిసిపోతారేమో!''

"ఫరవాలేదు.''

వర్షం భోరున కురుస్తూంది.

విద్యుద్దీపాలు ఆరిపోయాయి.

రోడ్డమీద చీకటి రాజ్యంచేస్తోంది.

మెల్లగా జంక్షన్ చేరుకున్నాం. అక్కడ ఒకేఒక్క రిక్షా ఉంది.

మా పరిస్థితి గమనించి వాడు కొండెక్కిపోయాడు. మొదట వర్షంలో రాలేనన్నాడు. తరువాత చాలా కిరాయి అడిగాడు ఎలాగో బేరం కుదిర్చాను.

''మాధవి ! మీరు వెళ్ళండి.''

''మీరు !''

"మరో రిక్షాకోసం ప్రయత్నిస్తాను. లేదా నడిచి వెళ్తాను."

నాకూ ఆమెకీ యిద్దరికీ తెలుసు మరో రిక్షా దొరకడం అతి కష్టమని.

"అలాగ వద్దు. రండి. ఇద్దరమూ వెళ్దాం-" అంటూ రిక్షాలో నాకు చోటు చూపింది.

''నిజంగా ఫరవాలేదు. నేను ఎలాగో ఒకలాగ వెళ్ళగలను.''

''వద్దు. రండి-"

"తరువాత మీరీ సంఘటన తలచుకుని పశ్చాత్తాప పడతారేమో ! అప్పుడు మీరు నన్ను ఎంతమాత్రమూ క్షమించలేరు "

"దేనికి !"

చెప్పలేకపోయాను

"ప్లీజ్-రండి "

ఇక తప్పలేదు. మనసులో మహదానందంగా ఉంది అంత అందమైన ఆమె ప్రక్క కొన్ని నిమిషాలపాటు కూర్చొగలిగే అవకాశం లభించింది.

ఆమె యిల్లు సందులన్నీ తిరిగితే తప్ప రాలేదు.

తీరా సమీపించేసరికి రిక్షా చెయిను తెగిపోయింది.

ఆమె ఒత్తిడి చేయగా వాళ్ళిందికి వెళ్ళాను.

ఆ యిల్లు చూశాక నాకు చాలా ఆశ్చర్యం వేసింది.

నా భావం గ్రహించినట్లు - సిగ్గుపడుతూ అందామె-నేను" పేదరాలిని."

ఆమె కన్నులలో మెదిలిన నీలినీడలు నాకేవో కథలు చెప్పబోయాయి

ఆమె గదిలోకి ప్రవేశించి — చిన్న దీపం వెలిగించింది.

ఆ దీపం ప్రకాశవంతంగా లేదు. చాలీచాలని వెలుగులో ఆ గదీ దానిలోని సామానులూ మరీ బీదగా కనిపించసాగాయి.

ఆమె నాకు చిన్న తువ్వాలిచ్చి తల తుడుచుకోమంది.

"మిమ్మల్ని చాలా శ్రమ పెడుతున్నాను తడిసి ఉన్న మీకు వేడిగా టీ యివ్వాలన్నా అసమర్థురాలినై పోయాను భగవంతుడు నన్ను క్షమించడు."

"ఉహుఁ. మీరలాగ మాట్లాడకండి. నేను భరించలేను."

వర్షం ఫోరున కురుస్తూనే ఉంది బయట.

ఆమె ఉండడంవలన కాబోలు ఆ గదిమాత్రం నాకు వెచ్చగా స్వర్గంగా తోస్తోంది.

వేళ చాలా అయింది.

"చూడండి-మీరేమీ అనుకోకపోతే-యిక్కడ భోజనం కానిద్దురుగాని."

"మీకు యిబ్బంది ఔతుందేమో ?''

నిజానికి నాకు ఆకలిగా లేదు. కాని - ఆమె అతిధ్యం స్వీకరించి ధన్యుణ్ణి వాలన్న కోర్కెమాత్రం నన్ను బలీయంగా పెనవేసుకుంటూంది.

"సాయంత్రం పూరీలు చేసి ఉంచాను అవే యిద్దరయినా తిందాం. మిఠాయిలు తెప్పించాలన్నా వర్షం ఒకటి...పీడిస్తూంది."

నేను వర్షానికి ధన్యవాదాలు చెప్పు కుంటున్నాను.

ఈ వర్షం నా పాలిట వరం. ఈ వర్షమే లేకపోతే నా కిమెతో యీ పరిచయమూ తీయని అనుభవాల పరంపరలూ ఎలా లభ్యమయ్యేవి ?

ఈ వర్షం ఎన్నటికీ తగ్గకుండా యిలాగే-ఉండిపోతే !

వెర్రి కోరిక.

ఆమె నాకు ప్లేటుతో పూరీలు తెచ్చింది ఉల్లికూర వేసి.

"మీరు కూడా తీసుకోండి."

కాదనకుండా ఆకులో పూరీలు తెచ్చుకుందామె.

అప్పటికి ఆమె జుత్తు ఆరిపోయి - నది పాయలుగా విడినట్లు ఆమె భుజాల మీద పరచుకుంది. పాపిట్లో సిందూరం మెరుస్తోంది.

అలంకరించుకొని ఆమె-సహజంగా స్వచ్ఛంగా అప్పుడే పూసిన పూవులా ఉంది. ఆమె తినడం ముగించింది.

వర్షం వెలిసే సూచనలు కనిపిస్తున్నాయి.

ఏదో గుర్తుకు వచ్చినట్లు హఠాత్తుగా అందామె. "దయచేసి మీరు వెళ్ళిపొండి."

త్రుళ్ళిపడ్డాను.

ఆమె యింత కఠినంగా ఆ విషయం చెప్పగలదని ఊహించని నాకామె మాటలు కఠోరంగా వినిపించాయి.

ఒక్కసారామె ముఖంలోకి చూశాను.

మరుక్షణం - శరంలా వీధిలోకి దూసుకుపోయాను.

ఆమె అర్ద్రమైన కన్నులు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. మళ్ళీ ఆమె ముఖం చూడడానికి ధైర్యం చాలలేదు. కాని-సాయంత్రం అయ్యేసరికి మనసు నిలవలేదు. ఆమె రాదనుకుంటూనే వెళ్ళి కూర్చున్నాను.

ఆమె వచ్చింది ! వస్తూనే ఆమె కళ్ళు నా కోసం వెదికాయి.




"నమస్తే భాస్కరం జీ !"

"నమస్తే."

ఈసారామె నాకు దూరంగా కూర్చో లేదు.

కొంచెంసేపు నిశ్శబ్దంగా ఉంది - హఠాత్తుగా రుద్ధకంఠంతో- "నిన్న... మీరు...క్షమించాలి...క్షమించరూ ?"

"దేనికి ?''

"ఇంకా నన్ను గాయపరచకండి. మిమ్మల్ని చాలా అవమానించాను ఆ నేరానికి నిష్కృతి లేదు ''

నేను మౌనం దాల్చాను.

"మీరు చాలా మంచివారు. పరిస్థితి అర్థంచేసుకోగలరు. నిన్నరాత్రి మీ మేలు కోరి - అలాగ చెయ్యవలసి వచ్చింది."

"మీరంటున్న పరిస్థితులేమిటో నాకు కొంచెమయినా తెలియవు."

ఆమె నిట్టూర్చింది. "మీవంటివారు వినదగ్గ మంచి కథేమీ కాదు నాది."

నేను నమ్మలేకపోయాను.

అంత అందమైన ఆమె వెనుక మరొకలాటి కథ ఉండడానికి అవకాశం లేదు

"చెప్పండి. మీకు అభ్యంతరం లేక పోతే" మెల్లగా అన్నాను

ఆమె ప్రారంభించింది.

## 4

కలకత్తా దగ్గరున్న చిన్న పల్లెటూరు మాది.

మా కుటుంబం పెద్ద సంపన్నమైన దని చెప్పలేను కానీ భుక్తికి లోటుండేది కాదు.

మా నాన్నకి గంజాయితోపాటు బ్రాకెట్ అలవాటయింది.

ఆశ వెనుక వెర్రి పరుగులుపరుగెత్తి విఫలుడయ్యాడు.

రోజూ గంజాయికి బ్రాకెట్ కీ డబ్బు కావాలి.

అమ్మకి-చిట్కా మందులకి లొంగని జబ్బు. నాకో అక్కయ్యా, అన్నయ్యా ఉన్నారు కానీ వాళ్ళెవరూ నాన్నకి సాయం చెయ్యగలిగే శక్తివంతులుకారు. బొటాబొటి బ్రతుకులు బ్రతుకుతున్నారు బెంగాలులో, ఆ మూల అక్కయ్యా యీ మూల అన్నయ్యా.

రోజు గడవడం దుర్భరం అయిపోతున్న సమయంలో నాన్న నన్నొక గానా బజానా యింటి కప్పగించాడు.

నిజానికి గానా బజానా నీచమయిన వృత్తికాదు ఉన్నతమయిన కళే సంగీతంతోనూ, నృత్యంతోనూ అతిధుల అంతర్యాలకు ఆనందం చేకూర్చడం. కాని-ఆ వృత్తిలో పతనం కావడానికి అవకాశా లెక్కువ ఎటుచూసినా జారుడు మెట్లుంటాయి. జాగ్రత్తగా అడుగు వెయ్యకపోతే అధఃపతనం తప్పదు

వృత్తిరీత్యాగాని, ప్రవృత్తిరీత్యాకాని నేను వేశ్యను కాను.

పాట పాడి మనసును పరవశింప జేయడమే నా ధ్యేయం నా ఉద్యోగం అంతవరకే కాని-ఒకసారి ఆంధ్రదేశం నుంచి వచ్చిన వ్యాపారి ఒకరు నన్ను చూసి యిష్టపడి—నాన్నతో సంప్రదింపులు జరిపారు. అంతవరకూ నానుంచి నాన్నకి నెల నెలా నూరురూపాయలు ముట్టేవి వ్యాపారి ఒక్కసారి ఐదు వేల రూపాయలు ఎరజూపేసరికి నాన్న నన్ను అమ్మెయ్యడానికి సిద్ధపడ్డాడు. నేను ఏడ్చినా మొత్తుకున్నా ప్రయోజనం లేకపోయింది.

ఆ వ్యాపారి నన్ను పెళ్ళిచేసుకునేటట్టూ చాలా విధాల సుఖపెట్టేటట్టూ చిలవలు పలవలుగా వర్ణించి చెప్పడంతో నన్నాతనితో రైలెక్కించేశాడు నాన్న.

కొంతకాలంవరకూ నన్నపురూపంగానే చూసుకున్నాడు వ్యాపారి.

రాను రానూ నామీద మోజు తగ్గిపోయింది. పెళ్ళిమాటెత్తితే నవ్వేసి-"నీతో పెళ్ళేమిటి?" అనేవాడు.

ఒక్కమాటలో - నేనతనికి ఉంపుడుకత్తెని ఇన్నాళ్ళూ అలాగే బ్రతుకుతూ వచ్చాను ఇకనుంచి...."

ఆమె ఆగిపోయింది

"ఏమైంది?"

"ఆయన నా ఖర్మకు నన్ను వదిలి వెళ్ళిపోయారు!"

"ఆ!"

"నా చుట్టూ శత్రువులు నేను పతితనని అనుకోను కారణం - నేనెన్నడూ నీచంగా ఆలోచించలేదు. అలా బ్రతకాలని నేను కోరుకోలేదు ఇప్పుడు - నాఅసహాయస్థితిని చూసి...నా అందాన్ని కోరుతూ...నన్ను వ్యభిచారిని చెయ్యా

లని వాళ్ళందరూ తీవ్రంగా ప్రయత్ని స్తున్నారు. రక్షణ లేనిదాన్ని. వాళ్ళని జయించడం కష్టమౌతుంది ఏమాత్రం వీలు దొరికినా నన్ను శాశ్వతంగా పాపకూపంలో పడెయ్యాలని వాళ్ళ ప్రయత్నం

నేను కొంచెం చదువుకున్నాను.

ఆయాగానో, స్కూలుకండక్టెర్ గానో ఉద్యోగం సంపాదించుకోవాలని ఎన్నోవిధాల ప్రయత్నిస్తూ ఓడి పోతున్నాను.

భవిష్యత్తు భయంకరంగా కని పిస్తూంది.

అమ్మా, నాన్నా కొన్ని నెలల క్రిందటే కన్నుమూశారు.

అక్కయ్య కానీ, అన్నయ్యకానీ నన్నాదుకుని ఆశ్రయమిస్తారన్న ఆశ లేదు.

ఇవీ నా పరిస్థితులు

నిన్నరాత్రి మీరు నా యింట ఉండే- చాలా గొడవ జరిగి ఉండేది.

మర్యాదస్తులయిన మీరు - అలకా జనంముందు పరువు పోగొట్టుకుంటా రన్న భయంతో - ఎలాగయినా మిమ్మల్ని పంపించెయ్యాలని - అలా అసభ్యంగా చెప్పవలసి వచ్చింది. క్షమించరూ ?"

చక్కని ఆమె కన్నులలో చిక్కని చీకట్లు !

అందమైన ఆమె వెనుక అతి దారుణ మయిన గతం ।

ఆమెకు రక్షణ కావాలి

నా హృదయం ద్రవించిపోయింది.

"మాధవీ !" పిలిచాను.

ఆమె చేపల్లాటి కనులెత్తి నన్ను చూసింది.

"మీకు నేనంటే అసహ్యం వేయడం లేదూ ?"

"దేనికి ?" ఆశ్చర్యంగా చూసింది.

"నేను...నేను...నల్లగా...నల్లగా"

"రంగు దేముంది ? హృదయం ప్రధానం కాని. మీరు చాలా సహృద యులు. మీ ఆత్మ అతి సుందర మయినది."

"మాధవీ !" ఆనందం పట్టలేక పోయాను.

నాలో ఉద్రేకమూ, ఉత్సాహమూ అవధులు మీరాయి ఒక్కసారి.

నాలోనూ అందాలు చూడగలిగిన సుందరి మాధవి.

"నిజంగానా ! మీ మాటలు నిజమేనా ?"

"మనస్ఫూర్తిగా చెప్పాను."

"మాధవీ ! - నేను - మిమ్మల్ని ప్రేమిస్తున్నాను." తొందరగా అనే శాను.

ఆమె కంగారుపడింది.

నేను యుక్తాయుక్తాలు మరిచి-ఆనంద

ర్భంగా - ఆలోచనారహితంగా ప్రేమ నివేదన గావించానేమో !

"నన్ను - నావంటి దాన్ని - మీరు ప్రేమించడమా ! వద్దు వద్దు."

" నీ సౌందర్యం - నీ వ్యక్తిత్వం-నన్నమితంగా ఆకట్టుకున్నాయి. నేను తపస్సు చేస్తున్నది నీవంటి అమ్మాయి కోసమే !

నన్ను నమ్మ మాధవీ

నేను నీకు రక్షణ కల్పిస్తాను. నీతో నా జీవితం పండించుకుంటాను.

ఈ దీనుడిని దయచూడు.

చీకటి నిండిన నా జీవితానికి వెలుగువు నువ్వు.

ఇంకా ఆమె నమ్మనట్లే చూసింది.

"మీరు ప్రసాదించే వరానికి నేనర్హురాలిని కాను భాస్కరంజీ ఈ పూవు ధూళిధూసరితమైంది. పాదాలకిందబడి నాశనం కావలసిందేతప్ప అలంకరించే అర్హత కోల్పోయింది

"కాదు మాధవీ. జీవితం విలువవేరు. నీ సౌందర్యం - నిరుపమానం ఆమె ప్రాధేయపడింది - తనను ప్రేమించ వద్దని.

ఆమె ఆలోచనలు నాకు తెలుసు

కాని-నేనామెపట్ల విపరీతంగా ఆకర్షితుడినయ్యాను.

నన్నసహ్యించుకోకుండా అనురాగంతో ప్రవర్తించిన మొదటి స్త్రీ ఆమె.

ఆమె గతం ఎటువంటిదయినా నాకనవసరం.

నాకు కావలసింది మాధవి. ఆమె చరిత్రకాదు.

మా స్నేహం మరింత గాఢం అయింది.

మాధవిని వదిలి నేనుండలేని పరిస్థితికి వచ్చాను.

ఆమె కూడా నన్ను ప్రేమిస్తూందని నాకు తెలుసు

చాలా గర్వంగా చూశాడు తంబి.

నాకు ఒకవంక ఆనందంగానూ ఉంది, మరోవంక బాధగానూ ఉంది.


''అయితే సంస్కర్తవి కాబోతున్నావన్నమాట ?" అన్నాను

''అదేమీ కాదు. నాకామె నచ్చింది. ఆమెకి నేను నచ్చాను. అంతే. దీన్ని నువ్వు మరోలా అంటే నేనేం చెప్పగలను ?''

''మాధవిని వివాహం చేసుకుందుకు గట్టిగా నిశ్చయించుకున్నట్లేగా ?"

"ఊఁ."

నాకు సంస్కరణ అంటే యిష్టం లేకపోలేదు చాలామందిలాగే నేనూ సంఘం మారాలి, మనుషులు మారాలి అనుకుంటూ ఆనందపడేవాడినే. ఎటొచ్చీ ఆ మార్పు మనదగ్గరినుంచి లేదా మనకి మరీ సన్నిహితులయిన వారి దగ్గరనుంచి ప్రారంభమౌతుందంటే-పిరికితనం ఆవహిస్తుంది.



"మాధవిని పెళ్ళిచేసుకుంటే భవిష్యత్తులో పశ్చాత్తాప పడవలసిన అగత్యం రాదని నీకు నమ్మకం ఉందా విందుగా ?"

"ఓ..." తల ఎగరేశాడు తంబి.

"సరే రేపు నన్ను తీసుకువెళ్ళి పరిచయం చెయ్యి త్వరలో మీ వివాహపు ఏర్పాట్లు చేస్తాను"

థాంక్స్"

**5**

మాధవి ఏకాకి.

తంబి స్థితీ దాదాపు అంతే.

ఎప్పుడో కృతజ్ఞతా సూచకంగా పండగకీ పబ్బానికీ డబ్బో బట్టలో పంపడంకంటె అతనికి మామయ్యా కుటుంబంతో ఎక్కువ సంబంధ బాంధవ్యాలుండడంలేదు

తంబి పెళ్ళికి నేనే పెద్దని !

స్నేహితులే తప్ప బంధువులు మచ్చుకయినా లేరు .

రిజిష్ట్రార్ ఆఫీసులో దివ్యంగా జరిగి పోయింది వివాహం.

పెళ్ళి అవుతుందనగానే తంబికి చక్కని చిన్నయిల్లు కుదిరింది.

మా యింట్లో రెండు మూడు రోజులు గడిపి- వాళ్ళిద్దరూ తమ యింటికి మారి పోయారు.

మాధవికి నా గురించి అంతా చెప్పే శాడు కాబోలు అతి త్వరలో ఆమెకి నేను అన్నయ్యనై పోయాను

తంబికీ, మాధవికీ కూడా నేను అన్న య్యనూ, మా శ్రీమతి అక్కయ్యా! ఆ వరసలో ఉండే ఆప్యాయతా ఆత్మీ యతా మరో పిలుపులో ఉండవేమో!

"ఇదంతా మీరు నాకు పెట్టిన భిక్ష అన్నయ్యా. మీమేలు జన్మలో మరచి పోలేను," అంది మాధవి తంబితో వాళ్ల కొత్త యింటికి వెళుతూ.

నవ్వేసి ఊరుకున్నాను.

నిజానికి తంబి మాధవికోసం తక్కువ త్యాగం చేయలేదు.

మాధవివంటి స్త్రీని ఉద్ధరించడం మామూలు మనుషులకి సాధ్యంకాదు. మంచిరంగు అని తప్ప పెద్ద అందగత్తె కూడా కాదు తంబి కళ్ళ సంగతివేరు. ఆమె తెల్లగా ఉంది. తనకి దగ్గరయింది. అది చాలు.

నిండుహృదయంతో ఆశీర్వదించాను నవదంపతులను

తరచుగా వాళ్ళు మా యింటికి వచ్చే వారు.

మేమూ వాళ్ళింటికి వెళ్లేవాళ్ళం

మాధవీ, తంబీ హాయిగా కనిపించే వారు

తంబి జీవితం గాడిలో పడిందని తృప్తిపడ్డాను.

కాని- నా తృప్తి ఆట్టే కాలం మిగల లేదు.

ఆనాడు మాధవి ఒంటరిగా మా యింటికి వచ్చింది.

కొంచెం ఆశ్చర్యపోయాను,

"మీతో కొంచెం మాట్లాడా లన్నయ్యా!" అంది నా గది గుమ్మం వరకూ వచ్చి నిలుచుని.

ఈసారి ఆశ్చర్యంతోపాటు అనుమా నమూ కలిగింది.

ఆమె ముఖంలోకి సాలోచనగా చూశాను.

ఆ కళ్ళల్లో సంతోషానికి బదులు మరేదో భావం కదులుతూంది.

"చెప్పు మాధవీ!"

స్త్రీహృదయం మీకు సులభంగానే అర్థమౌతుంది. ఆడదాని జీవితాని కర్థ మేమిటో తేలిగ్గానే గ్రహించగలరు..."

వింటున్నాను- ప్రశ్నలు వేయ కుండా.

"నేను జీవించాలని కోరుకుంటే... అది నాకోసంకాదు ఆయనని వివాహం చేసుకోవడంలో నా ఉద్దేశం... తల్లిని కావాలని. ఆడమనను కోరుకునే కనీ సపు కోరిక అది. దానికి వారూ వీరూ

అనే విచక్షణ ఉంటుందనుకోను. తల్లిని కావాలని తహతహలాడడం తప్పా?"

"ఎవరన్నారలా?"

"వారికోసం ఏ త్యాగం చేయమన్నా సంసిద్ధురాలినే, వారు నా కోసం ఎంత త్యాగం చేశారో గుర్తించలేని గుడ్డిదాన్ని కాను. కాని... అమ్మా అన్న పిలుపు కోసం నా అంతర్యం అలమటిస్తోంది. ఆ కోరికను చంపుకోడం నా తరం కాదు. అంతకంటె ఆత్మహత్యే మేలు."

ఉలిక్కిపడ్డాను.

మాధవి ఎందుకింత తీవ్రంగా మాట్లాడుతోంది?

ఏం జరిగింది?

మాధవి ఎందుకింత క్షోభిస్తోంది?

"ఏం జరిగిందో చెప్పకపోతే నాకెలా తెలుస్తుందమ్మా?"

మెల్లగా అడిగాను

"వారు... మీ మిత్రులు... నన్ను తల్లిని కావద్దని శాసిస్తున్నారు..."

తెల్లబోయాను.

"స్త్రీ ఎంత హీనురాలయినా ఇంత శిక్ష అనుభవించవలసిందేనా?"

"ఉహుఁ. నేను తంబితో మాట్లాడతాను"

"వారు నాకు దైవసమానులే ఈ ఒక్క విషయంలో తప్ప మరెందులోనూ వారి ఆజ్ఞ మీరను. గీచిన గీటు దాటను." ఎడతెరపి లేకుండా ఏడుస్తోంది.

"నేను అన్నీ కనుక్కుంటాగా..." అభయమిచ్చాను.

"మీ రుణం తీర్చుకోలేను మీ కాజన్మాంతమూ కృతజ్ఞురాలినై పడి వుంటాను."

"ఆ మాటలెందు కిప్పుడు?"

మాధవిని ఓదార్చి పంపేశాను.

తంబి- మాధవి ఎంత సన్నిహితులయినా వాళ్ళ సంసార విషయాలలో తల దూర్చడం నాకు భావ్యమేనా?

పైగా- యిది చాలా సున్నితమయిన విషయం

నేను కల్పించుకుంటే ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందో?

నా ఆలోచనలు ఒక కొలిక్కి రాకుండానే తంబి వచ్చాడు!

"ఏమిటి విశేషాలు?" మామూలుగా అడిగాను.

"మాధవి యిక్కడికి వచ్చిందా?"

"ఊఁ."

"ఏమయినా చెప్పిందా?"

"ఎందుకో చాలా విచారంగా కనిపించింది..."

"ఏమీ చెప్పలేదూ?"

"చెప్పింది, నేను తరచి తరచి అడిగితే."

"ఏమని చెప్పింది?"

"అది తరవాత చెబుతాను. ఒక విషయం చెప్పు నువ్వు."

"స్త్రీ- భార్య అంటే నీ ఉద్దేశ మేమిటి ?''

తంబి మౌనం దాల్చాడు.

"మగవాడిలా ఆమె కూడా మని షేనా ?''

''ఔను, మగవాడికంటే ఎక్కువే."

"ఆమెకీ మనస్సుంటుందా ?''

"ఏమిటీప్రశ్న ! మనసులేని మని షంటూ ఎవరుంటారు ?"

"ప్రతివారికీ ఏవో కోర్కెలుం టాయి. అలా ఉండడం నేరమా ?"

"ఎంతమాత్రమూ కాదు."

"ఆ కోరికలను కత్తిరించి పారెయ్యా లనుకుంటే— న్యాయమా ?"

"ఉహుం. కాని..."

"అదికాదు. మాధవి స్త్రీ. ఆమె నిన్ను వివాహం చేసుకోడంలో- నిన్నూ తన జీవితాన్నీ కూడా ప్రేమించి-అంటే..."

''అర్థమైంది."

"మగవాడు మరీ స్వార్థపరుడై భార్య కనీసపు కోర్కెలను కూడా కాదంటే..."

"నా మాట విను "

"చెప్పు.''

సావధానంగా కూర్చున్నాను.

'నా జీవితంలో నీకు తెలియని కోణాలు లేవు."

"కావచ్చు.''

"మాధవిని ప్రేమించి పెళ్ళిచేసు కున్నాను-"

"ఔను "

"ఆమెను సుఖపెట్టాలనే తప్ప నాశనం చేయాలనే ఉద్దేశం నాకే మాత్రమూ లేదు."

"సుఖానికి నిర్వచనమూ రూపమూ మనిషి మనిషికీ మారుతూంటుంది. మాధవేకాదు, ఏ స్త్రీ అయినా సంతానవతి కావాలని గాఢంగా కోరుకుంటుంది. ప్రకృతి సహజమయిన కోరిక అది. దాన్ని కాదనడం క్రూరత్వమే ఔతుంది. తంబీ, నువ్వు కఠినాత్ముడివి కాదని నాకు తెలుసు..."

'అదికాదు. నాకు తండ్రిని కావా లంటే భయం, అన్యోన్యంగా సాగే మా దాంపత్యాన్ని పిల్లలు వొడిదుడుకుల పాల్జెయ్యడం..."

"అలా ఎందుకు భావిస్తున్నావు ? పిల్లలులేని యిల్లు కళకళలాడదు—"

''మేమా అదృష్టానికి నోచుకోలేదు,''

"కారణం చెప్పమంటున్నాను.''


''నేను నల్లగా ఉంటాను. ఒకవేళ పిల్లలకి నా రంగే వస్తే—"

"మాధవి పోలికలెందుకు రాకూ డదు ?"

"వస్తే మంచిదే. అలా కాకుండా నా పోలికలు వస్తే ? నా నలుపు రాకూడదని నియమమేమీ లేదుగా ?"

జనటిక్స్ గురించి నాకు పెద్ద పరి జ్ఞానమేమీ లేదు.

పుట్టబోయే పిల్లలకి ఏ రంగు




వస్తుందో ముందు తెలుసుకోడం సాధ్యం కాదనుకుంటాను. అందుచేత విధిగా అదృష్టాన్ని నమ్మి తీరవలసిందే.

తంబికి రిస్కు తీసుకోవడం ఏమాత్రమూ యిష్టంలేదు. కాని—

మాధవిని తల్లి కావొద్దని శాశించడం మాత్రం ఘోరం.

"నీ ప్రవర్తన ఆమెను చాలా అసంతృప్తికి గురిచేస్తుంది. అప్పుడు— సంసారంలో కలత లేర్పడక మానవు. కలకంఠి కన్నీరు కాపురాన్ని కలత పరుస్తుంది..."

భయపెట్టాను— మరో మార్గంలేక.

తంబి దిగులుగా నా ముఖంలోకి చూశాడు.

నేను మౌనం దాల్చాను.

తంబి లేవబోయాడు.

"తంబీ!—"

"......"

"ఈ నెపంతో మాధవిని బాధించకు..."

"నేను మనిషినే."

"జీవితం ఎప్పుడూ ఒక్కలాగే సాగదు. మనిషిని దురదృష్టమేకాదు, అదృష్టమూ వరిస్తూంటుంది." ఆప్టిమిజమ్‌ని చొప్పించే ప్రయత్నం చేశాను.

తంబి మౌనంగా వెళ్ళిపోయాడు.

* * *

కొన్ని నెలల అనంతరం.. ఓ సాయంత్రం శ్రీమతి ప్లేటులో రకరకాల స్వీట్సు నా ముందు పెట్టి చిరునవ్వు నవ్వుతూ నిలుచుంది.

"ఏమిటి విశేషం?"

"వెళ్ళి— మీ మిత్రుణ్ని అభినందించి రండి."

ఏమిటన్నట్లు చూశాను.

"తంబి తండ్రి కాబోతున్నాడు..."

"ఓహో!... మాధవి కోరిక నెర వేర బోతూందన్నమాట" నవ్వాను

"ఏమిటో, తంబి ఆమెను తెగ వేధి స్తున్నట్లుంది."

"అదేమిటి ?"

"ఔను. ముందేమో పిల్లలు పుట్ట కుండా మాత్రలు మింగమన్నాడట. ఇప్పుడేమో పుట్టబోయే బేబీ తెల్లగా ఉండాలని ఏవేవో మందులు..." ఆగి అంది.

"మాధని బాధపడుతుంది మీ తంబి రంగు పిచ్చికి."

నేనర్థం చేసుకోగలను.

తంబి జీవితం అలాగ గడిచింది.

అతను నల్లగా కాకుండా తెల్లగా ఉంటే జీవితం మరోలా ఉండేది.

ప్రతి మనిషికి ఏదో పిచ్చి ఉండనే ఉంటుంది.

కొందరికి డబ్బు పిచ్చి.

మరికొందరికి కీర్తి కాంక్ష.

కొందరికి అందమీద వ్యామోహం.

జీవితమంటేనే ఏదో ఓ పిచ్చి. తప్పదు.

తంబి తన సంతానం తెల్లగానే ఉండా లని కోరుకోడం చాలా సహజం.

మాధవి తెల్లగాకాక నల్లగా ఉంటే తంబి ఆమెను ప్రేమించి ఉండేవాడు కాదు. పెళ్ళి చేసుకునీ ఉండేవాడుకాదు.

అతని జీవితంలో తెలుపు నలుపుల ఆట అంత తీవ్రమైనది!

అభినందించడానికి తంబి యింటికి బయలుదేరాను

శ్రీమతి - ఒట్టి చేతులతో వెళ్ళకూడ దని స్వీట్స్ ప్యాక్ చేసి పూలు కూడా యిచ్చింది

నేను వెళ్లేసరికి తంబీ, మాధవీ కబుర్లు చెప్పకుంటున్నారు.

నన్ను చూసి యిద్దరూ ఒక్కసారే "రండి అన్నయ్యా" అంటూ ఎదురు వచ్చారు.

స్వీట్లూ, పూలతో పాటు అభినందనలు కూడా అందజేశాను.

మాధవి టీ చేసి తీసుకువచ్చింది. ఆమె టీ చాలా చక్కగా చేస్తుంది.

రోజ్ ఎసన్స్ వేసిందేమో అంత దూరంనుంచే సువాసన లీనుతూంది టీ.

"మీకు చక్కని బంగారు బొమ్మ లాటి బాబు పుడతాడు" అని ఆశీర్వ దించాను

నా మాటలు వింటూ మెరిసే కళ్లతో చూసింది మాధవి.

కృతజ్ఞతలు తెలిపింది.

శ్రీమతి తరచుగా వాళ్ళింటికి వెళ్ళి సలహాలూ, సహాయలూ చేసి వచ్చేది. తంబికి పుట్టే శిశువెలా ఉంటాడో అని నేనూ ఆత్రుతపడుతూనే ఉన్నాను.

చక్కని రంగయితే తంబి గర్వ పడతాడు. బోలెడంత సంతోషిస్తాడు.

కాకపోతే ?

శిశువు నల్లగా తంబిని పోలితే ?

ఏమౌతాడు తంబి ?

నిరాశతో క్రుంగి కృశించిపోతాడా ?

అతని అంతర్యంలో ఆవేదన చెల రేగుతుందా ?

ఏంజరగబోతుందో ?

తంబి జీవితంతో నలుపు తెలుపులు యిప్పటికే చాలా ఘోరమయిన ఆటలు ఆడుకున్నాయి

ఇంకా అతను భరించలేడు.

* * *

ట్రాఫిక్ జామ్ క్లియరయింది.

ముందుకు సాగిపోడాని కనుమతిస్తు న్నట్లు ఆకుపచ్చ దీపం వెలిగింది.

ఆత్రంగా కారుని ముందుకి దూకిం చాను.

మాధవి అంత ముక్తసరిగా మాట్లాడిందేం ?

ఏం జరిగింది ?

అసలు-మాధవే ఫోను దగ్గర కెందుకు రావలసి వచ్చింది ?

తంబి ఏమయ్యాడు ?

కొన్ని నిమిషాలలో అన్ని ప్రశ్న లకూ జవాబులు లభిస్తాయి.

కాని - యీ నిమిషాలు గడవ బోయేంతలోనే ఆత్రత !

హాస్పిటల్ ఆవరణలో కారాపి వార్డు లోకి పరుగెత్తాను.

డ్యూటీ సిస్టర్ ని ఆపి- 'మాధవి... డెలివరీకేస్...బెడ్‌నంబరు..."అన్నాను.

నా కంగారుకి నవ్వుకుంటూ-"కుడి చేతి ప్రక్కనే డెలివరీ వార్డ్. సిస్టర్ నడిగి బెడ్ నంబరు తెలుసుకోండి" అని వెళ్ళిపోయింది

మెల్లగా మాధవి బెడ్‌వద్దకు చేరుకున్నాను.

స్పెషల్ రూమ్ కనుక ఆమె ఒంట రిగా ఉంది

నన్ను చూస్తూనే దుఃఖం పట్టలేనట్లు తలవంచుకుంది.

"ఏం జరిగింది మాధవీ ? పాపా, బాబా ?''

"పాప."

"ఏదీ ?"

"కొంచెంసేపట్లో సిస్టర్ తెస్తుంది."

"తంబేడీ ?''

"వెళ్ళిపోయారు "

"ఎక్కడికి ?"

"తెలియదు'' - గద్గదిక స్వరంతో అంది.

"పాప-తెల్లగా."

"లేదు. నల్లగానే ఉంది'' - ఆమె కన్నుల నిండా కన్నీళ్ళు.

అర్థమైపోయింది

ఏది జరగకూడదనుకున్నానో అదే జరిగింది.

''రాత్రంతా యిక్కడే ఉన్నారు. తెల్లవారుజామున పాప పుట్టింది.''

చూశారు. మళ్ళీ వస్తానని వెళ్ళి పోయారు.

కాని-యింతవరకూ రాలేదు

నాకెందుకో భయంగా ఉంది.

నేను మూర్ఖంగా వారి జీవితాన్ని అశాంతిపాలు చేశానేమో !

"జరిగినదానిలో నీ బాధ్యత ఏముంది ?"

"ఉంది. పిల్లలు కావాలని నేనే ఆరాటపడ్డాను. భగవంతుడెంత దయా రహితుడు !"

"విచారించకు. తండ్రి వస్తాడేమో!" ఆశగా అన్నాను.

కాని - నా హృదయంనుంచి వచ్చిన మాట కాదది.

తండ్రి గురించి నా అనుమానాలు నాకుండనే ఉన్నాయి.

సరిగ్గా ఆ సమయంలో.

తండ్రి యింట్లో పనిచేసే మనిషి బ్యాగ్‌తో ఫ్లాస్కూ అవీ పట్టుకువచ్చింది.

తండ్రి నాపేర ఒకటీ, మాధవి పేర ఒకటీ ఉత్తరాలు పంపాడు.

ఆత్రంగా అందుకుని చదవసాగాను.

"నీ కిటువంటి ఉత్తరం వ్రాయవలసి రావడం నా దురదృష్టం. అడుగడుగునా విధి నన్ను వెక్కిరిస్తూనే వచ్చింది. నా దురదృష్టం పరాకాష్ఠ నందుకుంది.

మాధవి ప్రేమ తప్పిస్తే నా నల్లని బతుకులో మెరుపనేదే లేదు ! అదికూడా అతి త్వరగా మాయం అయిపోయింది !

నీకు తెలును - నా జీవితం ఆటస్థలమైంది. నలుపు తెలుపులు నా జీవితం మీద యిష్టంవచ్చినట్లు ఆటలాడుకున్నాయి. వాటి ఆటలో, నేను చిత్తుగా ఓడిపోయాను.

అన్ని దురదృష్టాలూ ఒకెత్తు - పాప నల్లగా పుట్టడం ఒకెత్తు

వివాహం కావడంతోనే నా జీవితం, ఆలోచనలూ కొంతమారాయి. మునుపు ఎప్పుడూ నా గురించే ఆలోచించుకునే వాడిని. మాధవి వచ్చాక నా ఆలోచనలను ఆమెకూడా పంచుకునేది.

కాని-యీ పాప పుట్టింది. నల్లగా పుట్టింది.

మళ్ళీ నన్ను ఎప్పటికప్పుడు గతం గురించి ఆలోచనలలోకి తరిమే నల్లపాప ! నా కన్నుల కెదురుగా మసలుతూంటుంది. నా గుండెలను రంపపుకోత కోస్తూ ఉంటుంది ఎటువంటి శిక్ష ! దీనికి పరిమితీ లేదు, నిష్కృతీ లేదు.

నేను పాపినీ అదృష్టహీనుణ్ణీ కాకపోతే - తండ్రినైనందుకు గర్వించవలసిన యీ తరుణంలో- నాకీ బాధ ఏమిటి ?

పాపమీద నాకు జాలిలేకపోలేదు.

పురిటి కందుమీద నాకు పగలేదు.

పాప భవిష్యత్తు తలుచుకుంటూంటే నాకు భయంవేస్తోంది.



తన నలుపుతోనే దురదృష్టాన్నీ, దుఃఖాన్నీ అవమానాలనీ వెంటబెట్టుకుని యీ క్రూరప్రపంచంలో ప్రవేశించింది పాప !

నన్నూ నా దురదృష్టాన్నీ పోలిన పాప !

ఎలా మరిచిపోగలను నన్నూ నా జీవితాన్నీ !

నల్లగా ఉన్నందువల్లనే నలుగురిలోనూ అవమానాల పాలయ్యాను.

నల్లగా ఉండడంవల్లనే దొంగనని పించుకున్నాను.

నల్లగా ఉండబట్టే అందరికీ లోకువయ్యాను.

అందువల్లనే అందరిచేతా ద్వేషించబడ్డాను.

నల్లని నా బ్రతుకు నలుగురిలోనూ నవ్వులపాలే అయింది.

నల్లనివాడిని కావడంవల్ల నన్ను మనిషిగా బ్రతకనివ్వలేదు.

నీడగా బ్రతికాను.

మగవాడినయిన నన్నే నలుపు యిన్ని అనర్థాలకి గురిచేస్తే - ఆడపిల్ల అయిన నా పాప భవిష్యత్తులో రోజూ ఎన్ని సమస్య లెదుర్కోవలసివస్తుందో ! ఊహించడానికే భయంవేస్తోంది.

నా కళ్ళముందు నా పాప. జీవితం అధ్వాన్నంగా అవమానాలతో సాగు

తుంటే భరించడం నా తరం కాదు రావ్, నా తరం కాదు.

అందుకే నేను దూరంగా వెళ్ళి పోతున్నాను — నా జీవితానికేకైక వరం అయిన నీ స్నేహాన్ని కూడా వదులు తుందుకు సిద్ధపడి.

మాధవిని ఏకాకిగా అనాథగా విడచి పెడుతున్నానన్న చింత నాకు లేదు. బేదుగా ఉన్నా - అలస్యంగా నేను గుర్తించిన నిజం ఏమిటంటే — ఆమె నన్ను ప్రేమించలేదు. తన జీవితాన్నీ భవిష్యత్తునీ ప్రేమించుకుంటూ నన్ను ప్రేమించినట్లు నటించిందంతే, నా ఆరోపణకి ఆధారంగా ఉంది. నిజంగా ఆమె నన్ను ప్రేమించే ఉంటే - నా కోరికను అర్థంచేసుకుని ఆమోదించేది. తల్లికావాలని పట్టుపట్టేదికాదు.

మాధవి నిబ్బరమయినదే.

ఆమె పాపతో హాయిగా జీవించడానికి కావలసినంత డబ్బు వదిలి వెళ్తున్నాను.

నాతో ఆమెకిక ఎలాగూ అవసరం లేదు. తన జీవితం తాను జీవించగలదు.

అందుకే నేను నిశ్చింతగా వెళ్ళిపోగల్గుతున్నాను.

ఈ ప్రయాణం ఎంతవరకో నాకూ తెలియదు

శలవిప్పించు

ఈ నల్ల తంబి జీవితంలో ఎవరికయినా కృతజ్ఞుడిగా ఉండవలసి ఉంటే అది నీ నొక్కడికే.

నా కోసం నువ్వేటువంటి త్యాగాలూ ఆత్మవంచనలూ చేసుకున్నావో నాకు తెలుసు. రెపరెపలాడే గాలిలో దీపం లాటి నా జీవితం ఎప్పటి కప్పుడు అంతమైపోకుండా నువ్వడ్డుపడుతూ వచ్చా విన్నాళ్ళూ.

కాని - యిక నీ చెయ్యో దాటి పోతున్నాడీ నల్లతంబి.

బ్రతుకులోని చేదు పూర్తిగా అర్థమైపోయాక - కమ్మని కబుర్లూ తీయని మాటలూ మత్యపెట్టలేవు మనిషిని.

నన్ను క్షమించి - శలవియ్యి.

నీ

నల్లతంబి.

ఉత్తరం చదవడం పూర్తయ్యేసరికి నా కళ్ళు నీళ్లు కమ్మసాగాయి.

నా హృదయంలో నీడలు

నల్లని నీడలు

నల్లని నీడలు నా హృదయంలో వికృతంగా నాట్యం చేయసాగాయి.

(సమాప్తం)